# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

LGTV

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094



ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,212 | పేజీలు -12 | ఆదివారం -31 - మే - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,




## ప్రాజెక్టుల పూర్తికి తగుదువు విధించండి: సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదు
- "ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవ తేదీలు ప్రకటించాం
- పెద్ద పరిశ్రమలను 18 నెలల్లోగా ఉత్పత్తి ప్రారంభించాలి
- . దశాబ్దాల తరబడి జాప్యం చేయడం సరైన విధానం కాదు'

## వచ్చే ఏడాది కేటీఆర్ పాదయాత్ర..
# కేసీఆర్ బస్సు యాత్ర

### అసెంబ్లీ ఎన్నికల దిశగా క్షేత్ర స్థాయిలో జోరు పెంచే యోచన

- ★బీఆర్ఎస్ భారీ వ్యూహం.. కేసీఆర్ దూకుడు
- ★కాంగ్రెస్ హామీల అమలు వైఫల్యాలపై నిరంతర రాజకీయ దాడి
- ★కాంగ్రెస్ వ్యతిరేక ఓటు బీజేపీ వైపు వెళ్లకుండా ప్రత్యేక ప్రణాళిక
- ★సంస్థాగతంగా పార్టీ బలోపేతం దిశగా కార్యాచరణ షురూ
- ★'సర్'పై అవగాహన పేరిట గ్రేటర్ ఎన్నికలపై స్పెషల్ నజర్
- ★'జెన్ జీ'ని చేరుకోవడం లక్ష్యంగా ప్రత్యేకంగా ముఖాముఖీలు




హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిస్తున్న రాజకీయ పోరుకు మరింత పదును పెట్టేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమైంది. ఎన్నికల హామీల అమలులో వైఫల్యం, ప్రజాసమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలనలో అవినీతి, అధికార పార్టీ నేతల అక్రమాలపై ఆరోపణలను ప్రధాన అస్త్రాలుగా మలుచుకోవాలని గులాబీ పార్టీ నిర్ణయించింది. మిగతా 2 లో

## రాజస్థాన్‌లోని పలు జిల్లాలను ముంచెత్తిన ఇసుక తుఫాను




రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!

చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం

అరగంట పాటు దట్టమైన ధూళితో అంధకారంగా మారిన వాతావరణం



## రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి 'ఏపీ సైబర్ గార్డ్' ఏర్పాటు

- డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి: సీఎం చంద్రబాబు
- ఫిర్యాదు అందిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలు
- ఆరు స్తంభాల వ్యవస్థతో సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రణాళిక
- ఏపీలో నేరం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని సీఎం స్పష్టం

అమరావతి: "డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" మిగతా 2 లో

## ప్రజాప్రతినిధులు వారంలో ఒకరోజు
# క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే

### కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లలా తయారయ్యారు

- ★ఇకపై 10 రోజులకోసారి కార్యకర్తలను కలుస్తా
- ★అప్పుడు పనిచేసిన వారిని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి..
- ★సోషల్ మీడియాలో వ్యక్తిగత ప్రచారమేనా.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల గురించి చెప్పరా?
- ★పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి చురక




హైదరాబాద్: ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. "మంత్రులు.. తాము ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లాకు ప్రతి 10 రోజుల్లో ఒకరోజు వెళ్లి.. పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా సమయం కేటాయించాలి. మిగతా 2 లో




## హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం

- చెరువు మధ్యలో కట్ట నిర్మించి.. రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా
- చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను కూల్చివేసిన హైడ్రా
- రెండు నెలల నోటీసు తర్వాత రంగంలోకి దిగిన అధికారులు
- చెరువు సరిహద్దులకు కంచె వేసి పరిరక్షణ చర్యలు ప్రారంభం




## గాదె వెంకటరెడ్డి మృతిపై
# రేవంత్ సంతాపం

- వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో కన్నుమూసిన గాదె వెంకటరెడ్డి
- రాజకీయాల్లో అత్యంత సౌమ్యుడు అని కితాబునిచ్చిన రేవంత్
- రాజకీయాల్లో ఆయన లేని లోటు తీర్చలేనిదని వ్యాఖ్య

హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి (85) మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## పోలవరం అడవుల్లో పులి సంచారం.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

### పులిని బంధించాలని అటవీ శాఖకు డిప్యూటీ సీఎం ఆదేశం




అమరావతి: పోలవరం జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. మిగతా 2 లో

## సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని
# ప్రజలు బాగా గుర్తించారు

### దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి

- "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు
- మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు
- రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు.



అమరావతి: గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్ట్రేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. మిగతా 2 లో

## నిన్ను దీవానాగాడు అంటే తప్పా?
# ధిమాక్ లేనోడు అంటే తప్పా?"

### నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు: కేటీఆర్

- ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్
- గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య
- కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ



హైదరాబాద్: తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత మిగతా 2 లో

## సీఎల్పీ సమావేశానికి ముందే
# గవర్నర్‌తో డీకే భేటీ



కర్ణాటక: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అనూహ్యంగా పావులు కదిపారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశం జరగడానికి ముందే ఆయన శనివారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్‌తో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరిం చుకుంది. తన సోదరుడు, మాజీ ఎంపీ మిగతా 2 లో

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

### సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం

పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం

సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన

విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం



ఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను మిగతా 2 లో

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. రాష్ట్ర మహాసభకు బయలుదేరిన హమాలీలు.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 30 .(లోకల్ గైడ్). సంఘటిత అసంఘటిత రంగాలలో ఎగుమతి దిగుమతులు చేస్తున్న హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ అల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు లకపాక రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలో జరుగుతున్న తెలంగాణ హామాలి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 4వ మహాసభకు నల్గొండ దొడ్డి కొమరయ్య భవన్ నుండి వెళ్తున్న వాహనాలను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇండ్లు లేని పేదలకు హమాలీ కాలనీలో నిర్మిస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని ఆలోచించారు. హక్కుల కోసం అడుగుతున్నా కార్మికులను నిర్బంధాలకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వంగ సంస్థలైన ఎస్బిఐ, బేవరిజస్, మార్కెట్ , ఎలక్ట్రిసిటీ స్టోర్ లలో పనిచేస్తున్న హమాలీల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న హమాలీలకు ఈఎస్ఐ,పి ఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తూ 50 సంవత్సరాలు నిండిన హమాలీలకు నెలకు 9000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహించిన కార్యక్రమాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ ,గంజి రాజేష్ హమాలీ ఫెడరేషన్, నాయకులు కత్తుల యాదయ్య నేలగొందరాశి లింగయ్య, సుంకరబోయిన వెంకన్న , వనపర్తి సోములు, వెంబడి వెంకన్న, సుధాకర్ రెడ్డి తదితరులు

## ఖమ్మం రూరల్ మండలం ఎదలాపురం మున్సిపాలిటీ




లోకల్ గైడ్" ఖమ్మం' లో చిన్న వెంకటగిరి నందుగల మహాలక్ష్మి టౌన్షిప్ లో కామ కళావతి వైఫ్ అఫ్ కిరణ్ కుమార్ ప్రెస్ మీట్ నిర్వహించారు.వీరు మహాలక్ష్మి టౌన్షిప్ లో రోడ్ నెంబర్ 1,ఫ్లాట్ నెంబర్ 66 గల ప్లాట్ ని మొర్రినేకల సత్యనారాయణ సన్నాఫ్ వెంకయ్య ఎదులపురం మున్సిపాలిటీ 12వ నెంబర్ వార్డు కౌన్సిలర్ వారి కుమారుడు మొర్రినేకల రోహిత్ సన్నాఫ్ సత్యనారాయణ వద్ద కామ కళావతి 68 లక్షలకు ప్లాట్,అందులో బిల్డింగ్ కాన్స్ట్రెక్షన్ బోర్ ఇతరమైనవి అన్నియు సమకూర్చి ఇచ్చే విధంగా బాండ్ పేపర్ రాసి ఇచ్చారు అతనికి డబ్బు మొత్తం చెల్లించినప్పటికీ నన్ను మోసం చేసి 68 లక్షలు నా వద్ద డబ్బులు తీసుకొని బోరు 20 అడుగులు మాత్రమే వేసి ఎక్కడ పనులు అక్కడ పూర్తి చేయకుండా మమ్ములను మోసం చేశారని వారు మీడియాకి తెలిపారు.ఇదేంటని అడిగితే మీదికి గొడవకి 20 మందిని తీసుకొని వచ్చి ఎస్ సి కులానికి చెందిన దానివి నన్ను ఈమీ చేయగలవు అని బెదిరిస్తూ గొడవ చేస్తున్నాడు.కావున నాకు ఈ బిల్డింగ్ కొనుగోలు చేయడం వల్ల 10 లక్షలు నష్టం జరిగిందని మీడియా ముందు వాపోయారు. కావున ఈ కొనుగోలు చేసిన డబ్బులు గాని మరియు బోరు 150 అడుగులు వేసి మిగతా మరమత్తులు అన్నియు రాసుకున్నటువంటి పత్రం ఆధారంగా పూర్తి చేసి అగ్రిమెంట్ లో భాగంగా ఆ ఇంట్లో ఉన్నటువంటి బోరు 150 అడుగులు వేసి ఇచ్చే బాధ్యత కన్స్ట్రక్షన్ వల్లది అని ఒప్పందం ఉన్నది కానీ వారు 20 అడుగులు బోరు వేసి ఇవ్వడం వల్ల ఈరోజు వాడుకోవడానికి నీళ్లు లేని పరిస్థితి ఏర్పడింది వారిని అడగగా మాకు సంబంధం లేదు. మీరేం చేసుకుంటారో చేసుకోమని బెదిరిస్తున్నారు.కావున వారిపై చట్టపరంగా చీటింగ్ మరియు క్రిమినల్ కేసులు పెట్టి మాకు న్యాయం చేస్తారని మిమ్మల్ని వేడుకుంటున్నాను.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం .

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 30.( లోకల్ గైడ్).నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు ఎస్.ఐ ఖలీలుద్దిన్ ఖాన్, ఏ.ఎస్.ఐ లు మట్టయ్య, రమేష్, యాదగిరి, శేఖర్ రెడ్డి ల రిటైర్మెంట్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని, రిటైర్ అవుతున్న అధికారులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పాటు క్రమశిక్షణతో, అంకితభావంతో సేవలు అందించిన అధికారుల కృషి వల్లే సమాజంలో శాంతి భద్రతలు పటిష్టంగా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజల రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ, పగలు రాత్రి తేడా లేకుండా సేవలు అందించి, పూర్తి ఆరోగ్యంతో పదవి విరమణ పొందడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. పోలీసు ఉద్యోగం కేవలం ఒక విధి మాత్రమే కాకుండా ప్రజల పట్ల బాధ్యతతో కూడిన సేవ అని పేర్కొంటూ, రిటైర్మెంట్ అనేది ఉద్యోగానికి మాత్రమేనని, పోలీస్ కుటుంబంతో అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ఎలాంటి ఆపద వచ్చినా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ సేవా కాలంలో చూపిన నిబద్ధత యువ పోలీసు




సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతరం కుటుంభం సభ్యులతో, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిచారు.అనంతరం రిటైర్ అయిన అధికారులకు జ్ఞాపికలు, శాలువాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఎస్బి సీఐ ఆది రెడ్డి,ఆర్.ఐ సంతోష్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయ రాజు,పోలీస్ సిబ్బంది, రిటైర్ అవుతున్న అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## "పొగాకు వద్దు - ఆరోగ్యం ముద్దు" పొగాకు రహిత సమాజం... మనందరి లక్ష్యం

జూనియర్ సివిల్ జడ్జి అవినాష్




నారాయణపేట మే 30:పొగాకు రహిత సమాజం నిర్మిద్దామని అది అందరి బాధ్యత అని నారాయణపేట జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ అన్నారు.శనివారం నారాయణపేటలోని ఆర్.డి.ఓ కార్యాలయంలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యములో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ అధ్యక్షతన 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగించారు.ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31వ తేదీన మనం 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' జరుపుకుంటున్నామన్నారు. పొగాకు వల్ల కలిగే ప్రాణాంత క అనారోగ్య సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. పొగాకు వాడకం అనేది కేవలం ఒక వ్యక్తి ఆరో గ్యాన్ని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలను కూడా ఆర్థికంగా, మానసికంగా చిన్నాభిన్నం చేస్తుందన్నారు. ఎంతోమంది చిన్న వయస్సు లోనే ప్రాణాలు కోల్పోతు న్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. మన ఆరోగ్యం, మన కుటుంబాల భద్రత కోసం మనం ఈ రోజే పొగాకుకు దూరంగా ఉండాలని గట్టిగా నిర్ణయించుకోవాలనీ కోరారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా -- సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ లేదా జర్దా -- అది ప్రాణాలకు హానికరమేన న్నారు. పొగాకులో ఉండే నికోటిన్ అనే విష పదార్థం మనిషికి త్వరగా వ్యసనప రుడిగా మారుస్తుందన్నారు. దీనివల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, నోరు, గొంతు క్యాన్సర్, గుండెపోటు వంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయన్నారు. ధూమపా నం చేసేవారికే కాకుండా, ఆ పొగను పీల్చే చుట్టుపక్కల వారికి కూడా సమానమైన ప్రమాదం ఉందన్నారు.బాల్య వివాహాల కి పూర్తిగా అడ్డు కట్ట వేయాలనీ. బాల్యకార్మిక వ్యవస్థ ని రూపుమాపాలనీ కోరారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.లక్ష్మిపతి గౌడ్,జిల్లా విద్యాధికారి డాక్టర్ జయచంద్ర మోహన్ ,డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ జాం రాజు, ఆంజనేయులు,కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పిల్లలకు దుస్తుల పంపిణీ



నారాయణపేట మే 30:అమ్మ మాట అంగన్వాడీ బాట లో భాగంగా శనివారం నారాయణపేట మండలం ఎక్లాస్పూర్ అంగన్వాడీ కేంద్రం లో అంగన్వాడీ చిన్నారులకు గ్రామ సర్పంచ్ చంద్ర శేఖర్ గౌడ్ యూనిఫా మ్ పంపిణీ చేశారు, అలాగే 5 సంవత్సరములు నిండిన పిల్లలకు విద్యారంభ ధ్రువీక రణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు రమేష్ , సూపర్వైజర్ గీత, అంగన్వా డీ టీచర్స్ సువర్ణ, సావిత్ర మ్మ, ఆయమ్మ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## రైతుభరోసా పై స్పష్టమైన ప్రకటన చేయాలి సామాజిక కార్యకర్త నర్సింహ



నారాయణపేట మే 30:తెలంగాణ ప్రభుత్వం రైతుల ను ఆదుకోవడం కోసం ప్రారం భించిన రైతుభరోసా సరి అయిన సమయానికి రాక సన్నకారు, చిన్నకారు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ఒక ప్రకటనలో తెలిపారు. ఆయ న సింగారం గేట్ దగ్గర పొలాల్లో పత్తి విత్తనాలు పెడుతున్న కూలీలు, రైతుల లో రైతుభరోసా గురించి మాట్లాడి తెలుసుకున్నారు. యాసంగి సీజన్ లో కేవలం రెండు ఎకరాకకు మాత్రమే రైతుభరోసా నిధులు జమ చేశారాని వారు చెప్పారని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభము అయింది రైతు లు విత్తనాలు, ఎరువులు కొనుటకు చాలా రకాల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో పంటలు సరిగ్గా దిగుబడి రాక అప్పుల వారికి సకాలంలో చెల్లించక పోవడం వలన అప్పులు ఇస్తాలేరని కూలీకి వచ్చిన రైతులు అంటున్నారని తెలి పారు. తెలంగాణవ్యవసాయ శాఖ మంత్రివర్యులు, ముఖ్య మంత్రి రైతుభరోసా పై స్పష్ట మైన ప్రకటన చేసి యాసంగి, ఖరీఫ్ సీజన్ లో సరి అయిన సమయంలో పంటలు పండే భూములకు 5 లేక 10 ఎకరా లు కుటుంబ యూనిట్ పెట్టి రైతుల ఖాతాలలో రైతు భరోసా జమ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మరికల్ లో ప్రభుత్వ జూని యర్ కాలేజీర్పాటు చేయాలి బిజెపి



నారాయణపేట మే 30:మరికల్ మండల కేంద్రానికి తక్షణమే ప్రభుత్వ జూనియ ర్ కళాశాల మంజూరు చేయాలనీ మండల బిజెపి నాయకుడు రాజేష్ యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ప్రతి సంవత్సరం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 600 నుండి 700 మంది విద్యార్థులు పద వ తరగతి పూర్తి చేస్తున్నార ని కానీ ఇంటర్మీడియట్ చదువుకోడానికి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియ ర్ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందు లుఎదుర్కొంటు న్నారన్నారు. పేద,మధ్యతరగతి కుటుంబా లకు చెందిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదు వుకోవడం ఆర్థికంగా భారమ వుతోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అమ్మాయి ల విద్యపై దీని ప్రభావం ఎక్కువగా పడుతోందన్నారు.విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు.అందుకే మరికల్ మండల ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ, విద్యార్థుల భవి ష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే మరికల్ మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూ రు చేసి ఈవిద్యాసంవత్స రమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ పిలుపులో



లోకల్ గైడ్ ' తిరుమలాయపాలెం " ఖమ్మం జిల్లా' భాగంగా కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ,వంట గ్యాస్. నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని ఈరోజు తిరుమలాయపాలెం తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్( ప్రజాపంథా) పార్టీ జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ....కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ,ధరలు విపరీతంగా పెంచిందని ,పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడల్ ఆయిల్ ధరలు తగ్గినా కూడా భారతదేశంలో ఆయిల్ ధరలు తగ్గించడం లేదని, పెట్రోల్ ,డీజిల్ పంట గ్యాస్. నిత్యవసర సరుకులు ధరలు పెరగటం వలన పేద, మధ్యతరగతి వర్గాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పెట్రోల్, డీజిల్ ,వంట గ్యాస్ ధరలను తగ్గించాలని నాగేశ్వరరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆర్ గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని. అరులైన నిరుపేదలకి ఇళ్ల స్థలాలు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని.ఇందిరమ్మ ఇండ్లకు 10 లక్షల రూపాయలు ఇవ్వాలని. కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు. రాష్ట్ర ప్రభుత్వ ఐదు లక్షలు ఇవ్వాలని. 2000 నుండి 4000 వరకు పెంచిన పెన్షన్లు ఇస్తానని ఇంతవరకు ఇవ్వలేదని తక్షణమే 4000 రూపాయలు ఇవ్వాలని.వికలాంగులకు 6000 రూపాయలు ఇవ్వాలని. కొత్త వారందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈరోజు తిరుమలాయపాలెం డిప్యూటీ తాసిల్దార్ సుధీర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు. డివిజన్ నాయకులు ఎడ్లపల్లి నవీన్. బానోత్ శంకర్. పులిగుజ్జు వెంకటస్వామి. రాయల రాజా. గోకినపల్లి సరోజిని. వార్డు మెంబర్ ఆశీర్వాదం. రాయిండ్ల చిరంజీవి. రాయల వీరస్వామి. నామ వీరభద్రం. వడ్లపూడి వెంకయ్య. గోకినపల్లి మంగ. మీగడ సత్యం. తుపాకుల రాజేశ్వరరావు. లాలయ్య. వెంకన్న. ఉసిల నరసయ్య.గోకినపల్లి వెంకన్న. రమణ బోయిన నరసయ్య. తదితరు

## ఈరోజు మాజీ కార్పొరేటర్ లకవత్ సైదులు గారిని వారి నివాసంలో



లోకల్ గైడ్" ఖమ్మం' పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ శ్రీ తుమ్మల యుగంధర్ ,ఆయన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు,అనంతరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు , ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి ,జిల్లా నాయకులు కమర్తపు మురళీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు

## విద్యావ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది: మాజీ మంత్రి హరీశ్ రావు

### 30 డీఈఓ పోస్టులు ఖాళీగా ఉంచి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం -- సిద్దిపేట డీఈఓ శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ సభలో హరీశ్ రావు విమర్శలు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 30: రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈఓలు) పనిచేస్తున్నారని, మిగిలిన 30 పోస్టులను ఖాళీగా ఉంచి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసిందని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు.సిద్దిపేట రెడ్డి సంఘంలో నిర్వహించిన జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అదనపు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, ఐఏఎస్ అధికారులకు డీఈఓ బాధ్యతలు అప్పగించడం వల్ల విద్యారంగంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. వెంటనే రెగ్యులర్ డీఈఓలను నియమించాలని డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన "మన ఊరు -- మన బడి" కార్యక్రమాన్ని రాజకీయ కక్షతో అర్థాంతరంగా



నిలిపివేయడం వల్ల పాఠశాలల అభివృద్ధి కుంటుపడిందన్నారు. పథకం పేరు మార్చినా పరవాలేదని, కానీ బడుల అభివృద్ధిని ఆపకూడదని సూచించారు. ప్రస్తుతం కొత్తగా ఒక్క తరగతి గది నిర్మాణం కూడా చేపట్టడం లేదని విమర్శించారు.ఉపాధ్యాయుల డీఏలు, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీనివల్ల ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్ల బిల్లులు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ఆ భారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పడుతోందన్నారు.డీఈఓ శ్రీనివాస్ రెడ్డి సేవలను కొనియాడిన హరీశ్ రావు, సొంత జిల్లాలో డీఈఓగా పనిచేసే అవకాశం అరుదుగా లభిస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా ఆయనకు ఆ అవకాశం కల్పించామని తెలిపారు. నాలుగు సంవత్సరాల పాటు సమర్థవంతంగా సేవలందించి ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల మన్ననలు పొందారని చెప్పారు.పదో తరగతి ఫలితాల్లో వరుసగా ఆరు సంవత్సరాలు సిద్దిపేట జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టడంలో శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, "మన ఊరు -- మన బడి" పనుల అమలులోనూ విశేష కృషి చేశారని ప్రశంసించారు. పదవీ విరమణ ఆయన ఉద్యోగానికే గానీ, సేవలకు కాదని పేర్కొంటూ భవిష్యత్తులోనూ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

## వంగూరి వాచకం- నవరత్నాలు

1.ఎదగడానికైతే
ఏదైనా సమకూర్చగలం కదా
పూలు పండ్లు
పూసేది కాసేదైతే తానే కాదా.

2.ఎండలు మెండుగా
పెరిగాయని నీకు కోపమేలా నిండుకుండలా
మేఘాలై వర్షించేది నీకోసమేగా.

3.నిన్నటి విజయాన్ని
స్మరిస్తే స్పూర్తి
నేటి కర్తవ్యానికై
శ్రమిస్తే కీర్తి.

4.అన్నిటికీ అప్పిచ్చున్నది
క్రెడిట్ కార్డ్
ఎన్నిటినో ఇప్పిచ్చునది
ఆధార్ కార్డ్.

5.ఇచ్చేదైతే
"రేపు"అని చెప్పుడు
వచ్చేదైతే
చెప్పేది మాత్రం "ఇప్పుడు".

6.అధిక లాభాలు వస్తాయనే
ప్రకటనకు ఆశపడతావేల
బిందువులెన్నో కలవకనే
సింధువు అయ్యేది ఎలా.

7.మండువేసవిలో
మల్లెల పరిమళం
నిండు మనసుతో
పల్లెల ఆహ్వానం.

8.నోటి ఆకర్షణకు
లొంగిపోతే పిదప బేజారు
ఎర రుచి కొరకు
ఆశపడి బలయ్యే చేప తీరు.

9.కాలానికి బద్ధశత్రువు
బద్ధకం
సాధనకు సరియైన జోడి
సంకల్పం.

వంగూరి గంగిరెడ్డి
9652286270
షాద్ నగర్



## బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలి

– విద్యార్థి దశ నుండే సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

– బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలకు చైతన్యం కల్పించాలి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



లోకల్ గైడ్, తెలంగాణ :వికారాబాద్ జిల్లా :99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ – స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిగమించవచ్చని దానికి విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ నుండే సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటరీ సమావేశాల్లో చర్చించే విషయాలపై కూడా అవగాహన కల్పించుకోవాలని ఆయన తెలిపారు. నూతనంగా వచ్చిన ఏఐ విధానంపై అవగాహన కల్పించుకుని సాంకేతికతను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అని మహాత్మా గాంధీ సూచించిన విషయాన్ని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో తమ లక్ష్యాన్ని ఎంచుకోవడంలో ఉన్నత అధికారుల సలహాలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో స్నేహ సంఘాల్లో సభ్యులుగా చేరాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికి జిల్లాలో 4500 స్నేహ సభ్యులుగా నమోదు చేసుకున్నారని, స్నేహ సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని, జిల్లా యంత్రాంగం తరఫునుంచి తమ సహకారం కచ్చితంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.మాక్ పార్లమెంటరీలో విద్య, ఆరోగ్యం, హోం శాఖలపై చర్చించడం జరిగింది. మా పార్లమెంటరీ లో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులుగా స్నేహ సంఘాల సభ్యులు మంచి పాత్రను పోషించారని జిల్లా కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా నూతన అక్షరాస్యులుగా చదువు నేర్చుకున్న అభ్యాసకులకు, చదువు నేర్పిన వాలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ శ్రీనివాస్, అదనపు డీఆర్డీఏ నర్సింలు, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, వయోజన విద్య జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ బాబు, డీపీఎం నర్సింలు, కొమరయ్య, శేఖర్, నర్సింలు, జిల్లా మహిళా సమైఖ్య అధ్యక్షురాలు జానకీ, కార్యదర్శి శ్వేత, కోశాధికారి భాగ్యలక్ష్మి లతో పాటు స్నేహ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## బీసీల్లో చైతన్యం రాకపోతే బతుకు ఆగమే

## బీసీ పొలిటికల్ జేఏసీ

### నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ జిల్లాలో ఎండబెట్ల మరియు తాడూరు మండలంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీవిద్య గౌడ్ సీతారాల కలిసి శనివారం రోజున బిసి పొలిటికల్ జేఏసీ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నాగర్ కర్నూల్ టౌన్ ప్రెసిడెంట్ గొడుగు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సి, దశరథం, మహిళా కార్యదర్శి గొడుగు, శివమ్మ, టౌన్ యూత్ ప్రెసిడెంట్ మహేష్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, టౌన్ యూత్ ప్రెసిడెంట్ రాములు నాగర్ కర్నూల్ కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. తాడూరు మండల అధ్యక్షులుగా యార రమేష్ చిన్న, ఉపాధ్యక్షులు భరత్ కుమార్, సలహాదారులుగా తిరుపతయ్య, బుచ్చయ్య, సోషల్ మీడియా శివ, తాడూరు మండలం మహిళ అధ్యక్షురాలుగా అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్ వై, మల్లేష్, యూత్ ప్రెసిడెంట్ జి, కురుమయ్య, మహిళ జనరల్ సెక్రెటరీగా ఎం, హర్షిత ను తాడూర్ కమిటీ లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బీసీలకు స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు దాటుతున్నప్పటికీ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు బీసీలకు ఏ రైతు ఉన్నవో రిజర్వేషన్లు కానివ్వండి విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో మనకు రావాల్సిన వాటా మనకు రాకపోవడం మనము రాజకీయంగా లేకపోవడం వల్లనే ఈ రాజ్యాన్ని కొన్ని సామాజిక వర్గాలు మాత్రమే పరిపాలిస్తున్నారు కాబట్టి మనము అన్ని రంగాల్లో వెనుకబాటుతనంగానే మిగిలిపోయాము అన్నారు. అందుకే బీసీ పొలిటికల్ జేఏసీ విస్తృత స్థాయి కమిటీలు వేసి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బీసీలు ఏకతాటి పైకి వచ్చి పోరాడవలసిన సందర్భం ఉన్నది. అదేవిధంగా ఓటు చైతన్యం చేస్తూ మన ఓట్లు మనమే వేసుకుని చట్టసభల్లోకి వెళ్ళే విధంగా కృషి చేయాలని కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఖమ్మం...

లోకల్ గైడ్ " ఖమ్మండ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్షమద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి ఖమ్మం న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన ప్రత్యేక వాహన తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, వారికి నిర్వహించిన బ్రెత్ అనలైజర్ పరీక్షలో అనుమతించిన పరిమితికి మించి ఆల్కహాల్ స్థాయిలు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులను విచారించిన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (స్పెషల్ మొబైల్ కోర్టు), ఖమ్మం న్యాయమూర్తి శ్రీమతి బి. నాగలక్ష్మి గారు ధారావత్ సాయి కి 15 రోజులు, యనాల అఖిల్ రెడ్డి 7 రోజుల సాధారణ జైలు శిక్ష విధించబడిందని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలు ప్రాణాపాయ ప్రమాదాలకు దారితీస్తాయని, ప్రజలు రహదారి భద్రతా నియమాలను పాటించి, మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సూచించారు.

## పెళ్లిరోజు సందర్భంగా హమాలీ కార్మికులకు నూతన దుస్తుల పంపిణీ

100 మంది కార్మికులకు దుస్తులు అందించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి



తొగుట, (లోకల్ గైడ్)మే 30: సామాజిక సేవకు ప్రాధాన్యత ఇస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా హమాలీ కార్మికులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. తొగుట మండలంలోని ఘనపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై రవికాంత్‌తో కలిసి 100 మంది హమాలీ కార్మికులకు దుస్తులు అందజేశారు.ఈ సందర్భంగా అక్కం స్వామి మాట్లాడుతూ, మండుటెండల్లో కష్టపడి పనిచేస్తున్న హమాలీ కార్మికులకు తమ పెళ్లిరోజు సందర్భంగా చిన్న సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఎస్సై రవికాంత్ మాట్లాడుతూ, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ ప్రత్యేక సందర్భాలను సమాజానికి ఉపయోగపడే విధంగా జరుపుకోవడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చన్నారు.అనంతరం అక్కం స్వామి దంపతులను హమాలీ కార్మికులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం, శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి,

అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది,

–అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జూన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించారు.ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులు, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన, విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి తదితర కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నేపథ్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులన్నీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా పర్యవేక్షించాలని, నాసిరకం పనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వవద్దని హెచ్చరించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఆ దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, గడువులోపు పూర్తి కాని పనులపై సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారిస్తామని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొండారెడ్డిపల్లిని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, కేవీ నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయం, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి రాజేశ్వరి ,వివిధ జిల్లా , నియోజకవర్గం,మండల స్థాయి శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం: మాజీ మంత్రి హరీశ్ రావు

తెలంగాణ రాష్ట్రస్థాయి యోగా కోచెస్, జడ్జెస్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని సర్టిఫికెట్లు అందజేసిన హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 30:సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి యోగా కోచెస్ అండ్ జడ్జెస్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐదు రోజులపాటు శిక్షణ పొందిన కోచ్‌లు, జడ్జిలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి యోగా దివ్యౌషధమని అన్నారు. ఆధునిక జీవనశైలి, స్మార్ట్‌ఫోన్‌ల అధిక వినియోగం, సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల్లో ఏకాగ్రత తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో యోగా అత్యవసరమని పేర్కొన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని కాపాడే సాధన యోగా అని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.పిల్లల్లో ఏకాగ్రత, మానసిక స్థైర్యం పెంపొందించేందుకు పాఠశాలల్లో యోగాను తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆరోగ్యమే నిజమైన అభివృద్ధికి సూచిక అని, స్వచ్ఛమైన గాలి, నీరు, ఆరోగ్యకరమైన జీవనం అందినప్పుడే సమాజం అభివృద్ధి చెందినట్లు అవుతుందని అన్నారు.సిద్దిపేటలో గతంలో నిర్వహించిన "ఆనంద యోగ" కార్యక్రమం ద్వారా వేలాది మందికి ఉచితంగా యోగా శిక్షణ అందించామని గుర్తు చేశారు. యోగా శిక్షకులు పేదలకు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా యోగా నేర్పించాలని పిలుపునిచ్చారు.పిల్లల్లో అపజయాలను ఎదుర్కొనే మానసిక ధైర్యం, శారీరక దారుఢ్యం పెంపొందించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని హరీశ్ రావు పేర్కొన్నారు. రోజూ కొద్దిసేపు యోగా, ప్రాణాయామం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు.



## రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ కె. హేమావతి

జూన్ 2 వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం --

శాఖల వారీగా స్టాల్స్, పటిష్ట ఏర్పాట్లకు ఆదేశాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 30:శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కె. హేమావతి సమగ్రంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాన్ని సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు శాఖల వారీగా బాధ్యతలు కేటాయించాలని సూచించారు. మొత్తం కార్యక్రమాన్ని సిద్దిపేట ఆర్డీవో సదానందం పర్యవేక్షిస్తారని తెలిపారు.స్టేజ్ అలంకరణ, గ్రౌండ్ ముస్తాబు తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఉండాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, వ్యవసాయం, ఉద్యానవనం, పౌరసరఫరాలు, సోలార్ పవర్, జనగణన–2027, ప్రత్యేక ఓటరు నమోదు తదితర శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.ముఖ్య అతిథి ప్రసంగ ప్రతులు సిద్ధం చేయడం, నాణ్యమైన పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్ ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, సీటింగ్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా వైద్య సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమానికి అతిథులకు ముందస్తుగా ఆహ్వానాలు పంపించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, డీఆర్ఓ నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం ...



లోకల్ గైడ్' ఖమ్మంఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యలతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారుబి. నాగేశ్వర్ రావు, చీ. ఉప్పయ్య, ఖమ్మం టౌన్వీ. గురునాధం, ముదిగొండ్రూ. ప్రకాష్ రావు, ఎజ మదిర టౌన్పి. లక్ష్మణ్ రావు (ఎస్సై కమ్యూనికేషన్) కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ ఐ లు కామరాజు, అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి -- జూన్ 2 సిద్దిపేట సభను విజయవంతం చేద్దాం



దుబ్బాక (లోకల్ గైడ్)మే 30:శనివారం నిర్వహించిన ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంలో పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని దుబ్బాక నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, కవులు, కళాకారులు, మహిళలు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తుంచుకోవాలని కోరారు.ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొన్నవారు, జైలు శిక్ష అనుభవించినవారు, విద్యా మరియు ఉద్యోగ అవకాశాలను కోల్పోయినవారు ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది నేడు పేదరికంలో జీవిస్తుండగా, ఉద్యమంతో సంబంధం లేని వారు ప్రయోజనాలు పొందుతున్నారని పేర్కొన్నారు.గ్రామీణ స్థాయిలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమం కుల, మత, రాజకీయాలకు అతీతంగా సాగిన ప్రజా ఉద్యమమని, సబ్బండ వర్గాల ఐక్య పోరాట ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని నాయకులు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో, దుబ్బాక నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని ఉద్యమకారుల వివరాలను సేకరించి సమగ్ర నివేదికను కమిటీకి అందించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే ఉద్యమకారుల వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలని తీర్మానించారు.జూన్ 2న సిద్దిపేటలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఆ రోజు ముందుగా అమరవీరుల స్థూపాలకు నివాళులర్పించి, అనంతరం భారీ సంఖ్యలో సిద్దిపేట సభలో పాల్గొనాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో పెద్దిరాజు, అందె ప్రవీణ్, కిసారి స్వామి, గణేష్, యాదగిరి, రాజమౌళి, ర్యాకం శ్రీరాములు, మహేష్ రెడ్డి, అమ్మనా నర్సింహారెడ్డి, పర్స కృష్ణ, ఎల్లారెడ్డి, డాక్టర్ విట్టబోయిన వెంకటేష్, డప్పు బాబు, లింగం, మల్లయ్య దారా, రాజిరెడ్డి, దయాకర్, ఆస ముత్యం, వెంకటస్వామి, కాలేరు శ్రీనివాస్, జీడిపల్లి రవి, బిక్షపతి, పద్మయ్య, కళ్యాణ్, దేవరాయ ఎల్లం, ఇల్లందుల శ్రీనివాస్, వల్లల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పేట 18 వ వార్డులో అంగన్వాడిబ్విద్యార్థులకు దుస్తుల పంపిణీ




నారాయణపేట మే 30:నారాయణపేట మున్సిపాలిటీ లోని 18 వర్డ్ లో రెండు అంగన్వాడీ సెంటర్లలో శనివారం వార్డ్ కౌన్సిలర్ గొల్ల రవితేజ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రెస్ లు పంపిణి చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ రవితేజ,కాంగ్రెస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ రఘుబాబు మాట్లాడుతూ చిన్నపిల్లలను అంగన్వాడీ కి పంపి వారి అభివృద్ధికి పాటు పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయలు పాల్గొన్నారు

## చలో హైదరాబాద్ విజయవంతం చేయండి
## కేకే కమిటీ సభ్యులు ప్రత్యేక ఉద్యమకారులతో సమావేశం.

మండ్లదేవన్న నాయుడు

ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి



వనపర్తి జిల్లా ఇన్చార్జి (లోకల్ గైడ్ )మే 30హైదరాబాదులో 31 తేదీ ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సదస్సుకు కేకే కమిటీ సభ్యులకు జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు ప్రకటనలో పేర్కొన్నారు. కేశవరావు. కే కే . మరియు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీతో సమావేశ జరుగుతుందని తెలిపారు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారం ఉండి ఉద్యమకారులను పూర్తిగా చిన్నచూపు చూస్తూ ఉద్యమకారులను అణచివేసిన ఘనత కెసిఆర్ కు దక్కింది అని ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి లో కెసిఆర్ కుడి భుజం అని చెప్పుకునే నాయకుడు తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకున్న పాపాన పోలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి ఒక కమిటీ వేసి ఉద్యమకారులకు గుర్తింపు కార్డు 250 ఇంటి గజాల స్థలం ఇస్తామని చెప్పడం జరిగింది సీఎం రేవంత్ రెడ్డి కి, వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడిమేఘా రెడ్డి కి ఉద్యమకారుల తరఫున ప్రత్యేకత కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను వనపర్తి జిల్లా ఉద్యమకారులు కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు

## విద్యార్థినిల మాక్ పార్లమెంట్...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)గ్రామీణాభివృద్ధి శాఖ మంచిర్యాల స్నేహ సంఘాల సభ్యుల ద్వారా మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం విద్యార్థినీలు మాక్ పార్లమెంట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్




రావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినిలకు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అదేవిధంగా పార్లమెంటు వ్యవహార శైలి పట్ల అవగాహన కల్పించారు.మాక్ పార్లమెంట్ నిర్వహణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీలందరినీ అభినందించి,వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య,డి ఆర్ డి ఏ కిషన్,మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య,డిపిఓ వెంకటేశ్వర రావు,మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,వివిధ శాఖల అధికారులు,స్నేహ సంఘాల సభ్యులు,ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా కలెక్టర్
## దివాకర టి. ఎస్ గారిని మర్యాదపూర్వకంగా



ఖమ్మం :లోకల్ గైడ్ :కలెక్టరేట్ - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి సత్తుపల్లి నియోజకవర్గం వివిధ సమస్యల గురించి కలెక్టర్ గారితో చర్చించిన సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

## కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధికి కీలక నిర్ణయాలు...
## మున్సిపల్ స్వచ్ఛతకు 4ఆటోలు ప్రారంభం..

చైర్ పర్సన్ డాక్టర్ సంధ్యా రాణి



రామకృష్ణాపూర్ (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ గోడిసెల సంధ్యారాణి అధ్యక్షతన పలు అభివృద్ధి కార్యక్రమాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు.తాగునీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ,పారిశుధ్య సేవల మెరుగుదల,కోతుల నివారణ వంటి అంశాలపై సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.సమావేశం అనంతరం చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత,కౌన్సిల్ సభ్యులు,మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా కొనుగోలు చేసిన 4 స్వచ్ఛ ఆటోలను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతు కేతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి అభివృద్ధి పనికి ప్రాధాన్యత కల్పిస్తు పనులు పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తు క్యాతన్‌పల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు,మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్,రెవెన్యూ అధికారి సతీష్,డిఈఈ సుమతి,మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆశ్రిత్,రెవెన్యూ ఆఫీసర్ సతీష్,సానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సంతోష్ కుమార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమాన్ని గపారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్ :లోకల్ గైడ్ :రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన లితెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం ను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు శనివారం అధికారికంగా ప్రారంభించారు.తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.ఈ సందర్భంగా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.మండలాల వారీగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితులు మరియు వ్యవసాయ సూచనలను రైతులకు వాట్సాప్ ద్వారా చేరవేయనున్నట్లు మంత్రి తెలిపారు.కృత్రిమ మేధస్సు ఆధారిత వాతావరణ అంచనాలను వినియోగించడం ద్వారా రైతులు సరైన సమయంలో సాగు నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుందని, తద్వారా పంట నష్టాలను తగ్గించి ఉత్పాదకతను పెంచుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. రైతుల ఆదాయ వృద్ధి, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాల ప్రోత్సాహానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.అనంతరం రాబోయే రుతుపవనాలు, వర్షపాతం పరిస్థితులకు సంబంధించి తొలి వాతావరణ సూచన సందేశాన్ని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారి చేతుల మీదుగా వాట్సాప్ ద్వారా రైతులకు పంపించారు.ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, రైతులు నేరుగా వాతావరణ పరిస్థితులు మరియు వ్యవసాయ సూచనలకు సంబంధించిన ప్రశ్నలను వాయిస్ రూపంలో అడిగి సమాధానాలు పొందే విధంగా ఈ వేదికను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే ఈ సేవలను మండల స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు విస్తరించే విధంగా అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలని సంస్థ ప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కే. సురేంద్రమోహన్, ఐఏఎస్, వ్యవసాయ శాఖ సంచాలకులు శ్రీ బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు శ్రీ రాహుల్ రాజ్, ఐఏఎస్, ఇతర ఉన్నతాధికారులు, డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కే. సురేంద్రమోహన్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందన్నారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాల సాధనలో భాగంగా కృత్రిమ మేధస్సును వినియోగించి రాష్ట్ర రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు సుస్థిర వ్యవసాయాభివృద్ధికి ఈ కార్యక్రమం తోడ్పడుతుందని తెలిపారు.రాబోయే కాలంలో ఎల్‌నినో, వంటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ సాగు పద్ధతులను అవలంబించేందుకు రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల సమాచారాన్ని అందించే సామర్థ్యం ఈ కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థకు ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతు భరోసా నందు ఫోన్ నెంబర్ నమోదైన 17 జిల్లాలోని 304 మండలాలకు చెందిన 15 లక్షల మంది రైతులకు వాట్సాప్ ద్వారా ఈ సమాచారం అందడం జరుగుతుంది

## కిశోర బాలికల సాధికారతే సమాజాభివృద్ధికి పునాది.
## విద్య, ఆరోగ్యం, సంస్కారం జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతాయి -

పంచాయతీ రాజ్ ఊ గ్రామీణాభివృద్ధి,

మహిళా శిశు సంక్షేమం శాఖ మంత్రి

దనసరి అనసూయ సీతక్క.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): విద్య ఆరోగ్యం సంస్కార జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దాసరి అనసూయ ( సీతక్క ) అన్నారు. కిశోర బాలికల సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ - స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ముందుగా అమ్మ మాట-అంగన్వాడీ బాటా



కార్యక్రమంలో అంగన్వాడీ పిల్లలకు యునిఫామ్ లు విద్యారాంబ సర్టిఫికేట్ లను మంత్రి చిన్నారులకు అందజేశారు. మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ - స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కిశోర బాలికల సాధికారత, విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం మరియు నాయకత్వ లక్షణాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల బాలికలను చిన్న వయస్సు నుంచే గుర్తించి వారికి సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా భవిష్యత్తులో వారు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలు వంటి ఉన్నత స్థానాలను అధిరోహించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. విద్య జీవితాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధమని నెల్సన్ మండేలా చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, బాలికలు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం, ఇంటి పనుల్లో భాగస్వాములు కావడం, శ్రమకు విలువ ఇవ్వడం వంటి అంశాలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమన్నారు. సెల్‌ఫోన్‌ను వినోదం కోసమే కాకుండా జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే వరకు అంకితభావంతో కృషి చేయాలని బాలికలకు పిలుపునిచ్చారు.ఆరోగ్యమే మహాభాగ్యమని పేర్కొంటూ, పోషకాహారం తీసుకోవడం, స్థానికంగా లభించే సహజ ఆహార పదార్థాలను వినియోగించడం, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. విద్య ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు అందించడంతో పాటు వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు, వ్యాపార ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యత్వం ద్వారా ఆర్థిక భద్రతతో పాటు సామాజిక మద్దతు కూడా లభిస్తుందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది కిశోర బాలికలు "స్నేహ" కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారని, వారికి సైకిల్ శిక్షణ, నాయకత్వ వికాసం, వ్యక్తిత్వాభివృద్ధి, ఆరోగ్యం, విద్య తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సాధికారత కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. బాలికలు తమ ప్రతిభను గుర్తించి చదువు, క్రీడలు, కళలు, నాయకత్వం తదితర రంగాల్లో రాణించాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు గత రెండు దశాబ్దాలుగా గ్రామీణాభివృద్ధి, ఆర్థిక స్వావలంబనలో విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు బ్యాంకు రుణాలు పొంది వివిధ జీవనోపాధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం, మారుతున్న జీవనశైలుల నేపథ్యంలో కిశోర బాలికలకు సరైన మార్గనిర్దేశం అవసరమని, ఈ నేపథ్యంలో స్నేహ గ్రూపులు మంచి పౌరులుగా ఎదగడానికి వేదికగా నిలుస్తాయని చెప్పారు. ప్రతి బాలిక స్నేహ గ్రూపులలో సభ్యత్వం పొందడమే కాకుండా చురుకుగా పాల్గొనాలని సూచించారు. బాల్య వివాహాలపై ప్రత్యేకంగా స్పందించిన కలెక్టర్, 18 సంవత్సరాలు నిండకముందు ఏ బాలికకూ వివాహం జరగకుండా సంఘాలు, గ్రామస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. బాల్య వివాహాల వల్ల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని తెలిపారు. విద్య ద్వారానే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, ప్రతి బాలిక నాణ్యమైన విద్యను అభ్యసించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చదువుకు దూరం కాకూడదని సూచించారు. బాలికల చదువుకు ఆటంకం కలిగించే పరిస్థితులను సంఘాలు గుర్తించి నివారించాలని పిలుపునిచ్చారు. మహిళలు కుటుంబ బాధ్యతలతో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా పోషకాహారం, ఆరోగ్య పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భద్రత అంశం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ గ్రామాల్లో మహిళలు, బాలికలకు ఇబ్బందులు కలిగించే అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.సెల్‌ఫోన్ వినియోగంపై విద్యార్థినులకు సూచనలు చేస్తూ, మొబైల్ ఫోన్‌ను అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి అధిక సమయం కేటాయించి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. ఈ వయస్సు విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాల సాధనకు అత్యంత కీలకమని, ప్రస్తుతం కష్టపడితే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. స్నేహ గ్రూపుల ద్వారా మంచి అలవాట్లు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని, రంగారెడ్డి జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపే విధంగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.మాక్ పార్లమెంటరీలో విద్య, ఆరోగ్యం, హోం శాఖలపై చర్చించడం జరిగింది. మాక్ పార్లమెంటరీ లో స్పీకర్, మంత్రులుగా స్నేహ సంఘాల సభ్యులు మంచి పాత్రను పోషించారని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా నూతన అక్షరాస్యులుగా చదువు నేర్చుకున్న అభ్యాసకులకు, చదువు నేర్పిన వాలంటీర్లకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం అనంతరం మంత్రి, చేవెళ్ళ శాసన సభ్యులు, కలెక్టర్, ఇతర ఉన్నత అధికారులు కార్యక్రమంలో పాల్గొన్న బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, మహిళా, శిశు, దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా, జిల్లా అదనపు కలెక్టర్ కె.కిరణ్మయి, విమెన్ కమిషన్ మెంబర్ ఏ. సదాలక్ష్మి, పిడి డీఆర్డీఏ శ్రీలత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేశ్ మోహన్, పిడి మెప్మా వెంకట నారాయణ, వయోధిక విద్యా డైరెక్టర్ అనిత, డిపిఎంలు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య పాలకవర్గం సభ్యులు, స్నేహ సంఘం సభ్యులు, సిడిపిఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సమక్షంలో యువజన విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి పడాల రవీందర్ ఆధ్వర్యంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు శనివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఎండి రెహమాన్,కరుణాకర్,అక్షయ్ చిన్ను,అభిషేక్,సాయి శ్రవణ్,అక్షయ్, ప్రశాంత్,ధనుష్, రోహిత్,అక్షయ్,జోసెఫ్,అంజి తదితరులకు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో తోట తిరుపతి,పడాల శ్రీనివాస్,బల్లికొండ రమేష్,చోటు,నక్క తిరుపతి,జక్కం జగన్,జావిద్,వేణుగోపాల్,సూర్ల రాము,రామగిరి శ్రీకాంత్,ఎండి షకీల్,పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి బహిరంగ
## సభ స్థలాన్ని పరిశీలించిన అధికారులు.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద జూన్ 1న నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఏర్పాట్లు,అదేవిధంగా కెరమెరి మండలం కొతారి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్,ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు శనివారం సంయుక్తంగా పరిశీలించారు.సిఎం మాట్లాడే సభా స్థలాన్ని సందర్శించి ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించి,భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.సభా ప్రాంగణం,పార్కింగ్ ప్రాంతాలు,ప్రజల రాకపోకలకు ఏర్పాటు చేస్తున్న ఎంట్రీ,ఎగ్జిట్ మార్గాలను డ్రోన్ సాయంతో పరిశీలించి స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.భద్రతా ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ చర్యలు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సిఎం పర్యటన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి చిత్తరంజన్,ఆసిఫాబాద్ డిఎస్పి అశోక్,రెబ్బెన సిఐ సంజయ్,ఎస్ఐలు వెంకటకృష్ణ,సుబ్బారావు,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో నే బాల్య వివాహాల నిర్మూలన జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట మే 30: అందరి సహకారంతోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమని అందరి కృషితోనారాయణ పేట ను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. బాలికల చదువుతోనే బాల్య వివాహా లను నిర్మూలించడం సాధ్యం అవుతుందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వయోజన విద్య అమ్మకు అక్షర మాల, స్నేహ సంఘాల ద్వారా మాక్ పార్ల మెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కిశోర బాలికల సంఘాలను ఏర్పా టు చేయడం జరిగింద న్నారు. బాలికలు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకో వాలని సూచించారు. ఈ సారి పది ఫలితాలలో జిల్లా లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు అమ్మా యిలే కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఎప్పు డూ పది ఫలితాల్లో బాలి కలదే హావా అని చూస్తుం టాం కానీ ఉద్యోగాలలో మాత్రం బాలికలు వెనకబడి పోతారని, పదో తరగతి తర్వాత ఆరేళ్ల లో బాలికలు తీసుకునే నిర్ణయాలతో భవిష్యత్తును మార్చుకోవ ద్దని తెలిపారు. రేపు జరగ బోయే దాని గురించి ఈ రోజు ఆలోచించ వద్దన్నారు. అమ్మకు అక్షర మాల ద్వారా వయోజనులకు చదువు చెప్పే వీ వో లకు ఈ సంద ర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత పెరగాలని ఆమె సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ జిల్లా లో బాల్య వివాహాల నిర్మూలన కు మిషన్ మోడ్ లో పనిచేయాలన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి సహకారం ఉంటుందని చెప్పారు. బాలికలు తమ కోసం తాము ఫైట్ చేయా లని, తమ తోటి స్నేహితు రాలి కోసం కూడా ఫైట్ చేయాలన్నారు. మహిళలు చదువుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. కాగా అంతకు ముందు బాల్య వివాహాల నిరోధక చట్టం పై మాక్ పార్ల మెంట్ నిర్వహించిన కిశోర బాలి కలను జిల్లా కలెక్టర్,ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధుల నిర్వహణ లో ఉత్తమ ప్రతిభ చాటిన సి సి లు, సిబ్బందికి కలెక్టర్, ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజే శారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ వెంకట్ రాములు, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్ర మోహన్, డీ ఈ ఓ గోవింద రాజులు, డీ పీఎం, ఏ పీ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గింజ కొనాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

కేంద్రంపై నిందలు తగదు కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ



నారాయణపేట మే 30: రైతు పండించిన ధాన్యం ప్రతి గింజ కొనాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కానీ కేంద్రం సహకరించడం లేదని రాష్ట్ర మంత్రులు విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నా రు.తెలంగాణ రాష్ట్రంలో రైతు లు ఎంతో కష్టపడి పండించి న వడ్లు కొనుగోలు కాక కొనుగోలు కేంద్రాల వద్దే పేరుకుపో తున్నాయనీ రైతుల బాధలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.రోజుల తరబడి ఎదురు చూస్తున్న రైతులకు సరైన సదుపా యాలు లేక తీవ్ర ఇబ్బంది లు పడు తున్నారని ఆవేశం వ్యక్తం చేశారు. ఇప్ప టికే అకాల వర్షాలతో వడ్లు తడిసిపోవ డంతో రైతులు భారీ నష్టా లను చవిచూస్తు న్నారన్నా రు.పండించిన పంటకు ధర రాక, కొనుగోలు ఆలస్యం కావడం, తడిసిన ధాన్యాన్ని తిరస్కరించడం వల్ల రైతు ఆవేదనలో ఉన్నా డనీ అన్నారు.రైతు చెమట తో పండిన ప్రతి గింజకు విలువ ఇవ్వాల్సిన ప్రభు త్వం, రైతు ల కన్నీళ్లు కనిపిం చకపో వడం దురదృష్ట కరనన్నా రు.రైతుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?అని ప్రశ్నించారు.రైతు కష్టం గుర్తు కురాకపోతే, రైతు సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ప్రభుత్వానికి లేదని అన్నా రు.వెంటనే వడ్ల కొను గోళ్లను వేగవంతం చేయా లనీ, అకాల వర్షాలతో నష్ట పోయి న రైతులకు తక్షణ పరిహారం అందించాలనీ, రైతును ఆదుకునే చర్యలు వెంటనే చేపట్టాలనీ డిమాం డ్ చేశారు.కానీ ఆడలేక మద్దెల ఓడిందన్న రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరి స్తున్నదని అన్నారు.రైతులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు.

## వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

# జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు,నిల్వ,రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.జిల్లా కేంద్రంలోని ఎసిసి వద్ద గల హనుమాన్ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం దిగుమతి,నిల్వ ప్రక్రియలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు ధాన్యం నిల్వ,తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని,లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.అదేవిదంగా మందమర్రి మండల కేంద్రంలోని శ్రీవాసవి,అంబికా సాయి,సప్తగిరి రైస్ మిల్లులతో పాటు సారంగపల్లి,పొన్నారం గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి సందర్శించి



ధాన్యం కొనుగోలు,నిల్వ,ధాన్యం దిగుమతి,సిఎంఆర్ ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించారు.రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని,కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా ,వేగంగా నిర్వహించాలని తెలిపారు.ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు,నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు,టార్పాలిన్ కవర్లు,తూకం యంత్రాలు,ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు.కొనుగోలు చేసి తరలించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో నిలువ చేయాలని తెలిపారు.అనంతరం నస్పూర్ మండలంలోని స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

# నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

### జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి

### మహిళా వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ లో మాక్ పార్లమెంట్ నిర్వహణ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 30 : విద్యార్థి దశ నుండే బాలికలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం కిశోర బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, అదనపు డీసీపీ శు భం నగ్రాలే, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలు స్పీకర్, డిప్యూటి స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ సభా కార్యక్రమాలను



విజయవంతంగా నిర్వహించడం ద్వారా చట్ట సభలలో జరిగే సమావేశాల తీరును కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరింపజేశారు. మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధి తదితర అంశాలపై ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన వారు ప్రశ్నలను లేవనెత్తగా, సంబంధిత శాఖల మంత్రుల పాత్రను పోషించిన బాలికలు సమాధానాలు తెలుపుతూ మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. దాదాపు రెండు గంటలకు పైగా మాక్ పార్లమెంట్ సెషన్ అద్యంతం ఎంతో ఆసక్తిగా కొనసాగింది. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల పాత్రలో బాలికలు ఎంతో చక్కగా ఇమిడిపోయి రాణించడం పట్ల కలెక్టర్ వారిని అభినందిస్తూ తన తరపున పలువురికి ప్రత్యేక బహుమతులు అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సముచిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, తాము ఆశించిన దానికంటే ఎంతో ఉత్తమంగా బాలికలు రాణించి మాక్ పార్లమెంట్ ను విజయవంతం చేశారని ప్రశంసించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిణతిని ప్రదర్శిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని హితవు పలికారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలని, స్మార్ట్ ఫోన్లలో అనవసర విషయాలకు సమయం వృధా చేయకూడదని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యాల పరిరక్షణ కోసం తప్పనిసరిగా పౌష్టిక ఆహారం తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే నిస్సంకోచంగా అధికారుల దృష్టికి తేవాలని, భద్రతా పరమైన సమస్యలు ఎదురైనప్పుడు భరోసా కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు. కాగా, తల్లిదండ్రులు పిల్లలను సమ దృష్టితో పెంచాలని, బాలికల పట్ల వివక్షను ప్రదర్శించకూడదని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కేరళంలో అక్షరాస్యత 90 శాతానికి పైగా ఉందని, అదే స్ఫూర్తితో తెలంగాణాలో కూడా అక్షరాస్యతను గణనీయంగా వృద్ధి చెందేలా ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము గమనించిన పలు సమస్యలు, ఇబ్బందుల గురించి బాలికలు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరపున తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, జిలా సంక్షేమ అధికారిణి పద్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపట్ల నిర్లక్ష్య విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుదాం

-అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, మే 30 : అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ కారేపల్లి మండల ఆరవ మహాసభ జమాన్లపల్లిలో అమరులు కామ్రేడ్ పెద్ద బోయిన వెంకటేశ్వర్లు ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి నగర్ లో కామ్రేడ్ కోయల శ్రీనివాస్ కంచర్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మహాసభ నిర్వహించుకోవడం జరిగింది.ఈ సభలో ముందుగా సంఘంసీనియర్ నాయకులు కామ్రేడ్ అలంపెద్ద చంద్రన్న జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది నూతన కార్యవర్గాన్ని 11 మంది సభ్యులతో కార్యవర్గం ఏర్పడింది అధ్యక్షులుగా కోయిల శ్రీనివాస్ కార్యదర్శిగా కంచర్ల శ్రీనివాస్ రెడ్డిలను కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం ఏ ఐ కె ఎమ్ ఎస్ జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ మాట్లాడుతూ రైతు కూలీ సంఘ ఆధ్వర్యంలో గత 40 సంవత్సరాల నుండి దున్నేవానికి భూమి కావాలని అనేక త్యాగాలతో సాధించుకున్న పోడు భూములకు పట్టాలు కావాలని రైతాంగం పండించిన పంటలకు ఎం ఎస్ పి గిట్టుబాటు ధర చట్టం కావాలని భూస్వామ్య పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ఫారెస్ట్ పటేల్ పట్వారిలా దోపిడీలకు వడ్డీ నాగులకు వ్యతిరేకంగా నిత్యనిర్బంధాలను ఎదుర్కొనిఅనేక పోరాటాలు నిర్వహించిందని అనేక త్యాగాలతో సాధించుకున్న అటవీ హక్కుల చట్టం 170 యాక్ట్ పీసా ఫిఫ్త్ సిక్స్త్ షెడ్యూల్ అమలు చేయకుండా నూతన అటవీ సంరక్షణ పేరుతో చట్టాలను తుంగలో త్రొక్కి దేశంలో ఉన్న భూములను అడవులను అందులో ఉన్న ఖనిజ సంపదను ప్రభుత్వం రంగ పరిశ్రమలను బహుళ జాతి కంపెనీలకు ప్రైవేటు వ్యక్తులకు ఆదాని అంబానీలకు నేటి ప్రభుత్వాలుతాకట్టు పెట్టినారని ఈ విధానాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు రైతులు కూలీలు ఐక్యమై రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు , మహాసభను ఉద్దేశించి ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి వై జానకి సౌహార్ధ సందేశాన్ని ఇవ్వటం జరిగింది . ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు మద్దెల రామ్మూర్తి , రాంజీ , కావేటి నాగేశ్వరరావు , గడ్డం ఎంకన్న , ఆలయం గురవయ్య , కోమల్ చంద్రయ్య , బాటయ్య , రాంబాబు , సుగుణ , జోగయ్య సత్యనారాయణ , లక్ష్మీనారాయణ , రామనాథం తదితరులు పాల్గొన్నారు.

## సేవలందించిన వాలంటర్లకు సన్మానం



నిజామాబాదు జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 30 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి–ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాల్లో “ఉల్లాస్” కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన వాలంటీర్లు మరియు అభ్యాసకులను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం నిజామాబాదు పట్టణంలో శనివారం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీఆర్‌డీఓ సాయన్న, జిల్లా వయోజన విద్య సహాయ సంచాలకులు ఏ. పురుషోత్తం, అదనపు డీఆర్‌డీఓ



మధుసూదన్, ఏపీఓ అడల్ట్ ఎడ్యుకేషన్ అరుంధతి, డీపీఎంలు వెంకటేష్,నీలిమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యత నిర్మూలనలో వాలంటీర్లు చేసిన సేవలను అధికారులు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా చైతన్యం పెంపొందించడంలో వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. అభ్యాసకులు విద్యను అలవరచుకొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లు మరియు అభ్యాసకులకు స్మారక చిహ్నాలు అందజేసి సన్మానించారు. విద్య ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ పురోగతి సాధ్యమవుతుందని వక్తలు సూచించారు .

## మహిళల భాగస్వామ్యంతో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు



మహబూబ్నగర్ మే 30 (లోకల్ గైడ్ ప్రతినిధి జీవి గౌడ్)మహబూబ్‌నగర్ నగరంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పడేలా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో “ మహిళా శక్తి సూపర్ మార్కెట్లు ” ఏర్పాటు చేసి, మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములుగా, షేర్‌హోల్డర్లుగా చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ సూపర్ మార్కెట్లను మహిళలే నిర్వహిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మహిళలకు ఉపాధి, గౌరవం కలుగుతుందని ఆయన చెప్పారు.మహిళలను భాగస్వాములుగా చేస్తే ఈ వ్యవస్థ భవిష్యత్తులో పెద్ద కార్పొరేట్ సంస్థగా ఎదగగలదని ఎమ్మెల్యే సూచించగా, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించి, వెంటనే విధివిధానాల రూపకల్పనకు అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా, నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తక్కువ లీజుతో ప్రభుత్వ స్థలాలు ఇవ్వడం, రిటైల్ రంగంలో శిక్షణ అందించడం ద్వారా మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కృతజ్ఞత సభలో వేలమంది మహిళలు పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో రైస్ మిల్లులు, ఇతర పారిశ్రామిక యూనిట్ల నిర్వహణలో కూడా మహిళలకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల యొక్క.. ప్రజల చేత.. ప్రజల కొరకు ..



మే 30, 2026:ప్రజల యొక్క ప్రజల చేత ప్రజల కొరకు ఏర్పడిన ప్రజాస్వామ్యం మన దేశంలో కొనసాగుతు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్ నిర్వహణ కార్యక్రమానికి స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య,మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు,ఇతర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు భారత రాజ్యాంగం ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టే వారిని ఎన్నుకునే శక్తివంతమైన ఓటు హక్కు ప్రజలకు కల్పించబడిందని తెలిపారు.రాజ్యాంగం దేశాల వారీగా వివిధ రకాలుగా ఉంటుందని,మన దేశంలో అమలులో ఉన్న రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని,ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉన్నామని తెలిపారు.శాసన సభ,పార్లమెంట్,సర్పంచ్,మండల పరిషత్,జిల్లా పరిషత్,స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే స్వేచ్ఛ కలిగి ఉన్నామని,రాష్ట్ర,కేంద్ర ఎన్నికల సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని,సరైన నాయకులను ఎన్నుకునే స్వేచ్ఛ,హక్కు ప్రతి ఓటరుకు ఉంటుందని తెలిపారు.ఎన్నికలలో ప్రజలకు కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు.ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు.ప్రజలకు కల్పించిన హక్కులు,చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.అదేవిదంగా మంచిర్యాల ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని,ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదువుకోవాలని తెలిపారు.విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదని,సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని,విద్య ద్వారా జ్ఞానం సంపాదించుకోవాలని,హక్కులు,చట్టాలు తెలుసుకోవాలని,విద్యార్థిని,విద్యార్థులు ఆత్మ రక్షణ విద్య నేర్చుకోవాలని తెలిపారు.తల్లిదండ్రులు వారి పిల్లల కోసం పడుతున్న కష్టాలు తెలుసుకోవాలని,ఏకాగ్రత,పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు.మహిళల రక్షణ,పోషణ,స్వావలంబన,సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.దేశంలో అనేక రకాల మతాలు,కులాలు,విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరం కలిసి జీవిస్తున్నామని,మనది యువ భారత దేశమని,దేశ భవిష్యత్తు యువతదేనని అన్నారు.భౌగోళికంగా,ఆర్థికంగా మన దేశం పటిష్టంగా ఉందని,దేశ భవిష్యత్తులో విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు.అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాను ముందంజలో ఉంచాలని,జిల్లా ప్రజల సంక్షేమం కోసం అధికార యంత్రం సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు.

# చిలకమర్రి గ్రామానికి మీరు చేసిన సేవలు వెలకట్టలేనివి
# బిఆరెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కంటే శ్రీశైలం





( లోకల్ గైడ్ షాద్ నగర్)మా గ్రామానికి మీరు చేసిన సేవలు వెలకట్టలేనివని, మీరు ఎక్కడికి వెళ్లిన మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని బిఆరెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కంటే శ్రీశైలం అన్నారు. ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి బదిలీ సందర్భంగా ఆమెను శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంటే శ్రీశైలం మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా మా ఊరి గ్రామ పంచాయతీలో సేవలందిస్తూ పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించారని తెలిపారు.రెండు సంవత్సరాలు సర్పంచులు లేకపోయినా మా గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందు ఉంచారని అన్నారు.మా గ్రామాన్ని అభివృద్ధి పథం లో నడిపి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు రావడంలో మీ పాత్ర ఎంతో కీలకమని అభినందించారు.మీరు ఎక్కడికి వెళ్లి ఆ గ్రామాన్ని సైతం అభివృద్ధి చేసి మంచి పేరుప్రఖ్యతలు సాధించాలని వివరించారు. మీరు చేసిన అభివృద్ధి విషయంలో మేము ఎప్పుడు కట్టుబడి ఉన్నామని వివరించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ,నర్సింహా రెడ్డి, జర్నలిస్ట్ నరేష్,బిఆరెస్ నాయకులు శ్రీనివాస్,వార్డు సభ్యులు చంద్ర శేఖర్,రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడివయ్య, బ్యాగరి భీమయ్య, సూరారం శ్రీశైలం, గంగపురం నర్సింహా, బ్యాగరి బాల్ రాజు, మల్లేష్, శ్రీను, అంజి, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాల్లో
# కిశోర బాలికల మాక్ పార్లమెంట్ విజయవంతం

**ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ నైపుణ్యాల పెంపుదలకు విశేష వేదిక**





సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 30:మహిళా వారోత్సవాల సందర్భంగా సిద్ది పేట జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ (×ణుజ)లో కిశోర బాలికల మాక్ పార్లమెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఐదుగురు చొప్పున కిశోర బాలికలు పాల్గొని ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించుకున్నారు.ఈ కార్యక్రమానికి డీఆర్డీవో జయదేవ్ ఆర్యా ముఖ్య అతిథిగా హాజరై బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య, ఆరోగ్యం, నాయకత్వ లక్షణాల అభివృద్ధి ద్వారా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఏడీఆర్డీవో రోనాల్డ్ సుధీర్ కుమార్, జిల్లా మహిళా సంక్షేమ అధికారి (ణఔ), జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (ణవీసూ), ఏటీసీ ప్రిన్సిపాల్, ఎన్‌జీవో ప్రతినిధులు, సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.మాక్ పార్లమెంట్‌లో బాలికలు స్పీకర్, మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు, ప్రజాప్రతినిధుల పాత్రలను సమర్థవంతంగా పోషిస్తూ విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. ప్రజా సమస్యలను ప్రతిపాదించడం, ప్రశ్నించడం, సమాధానాలు కోరడం వంటి ప్రజాస్వామ్య హక్కులపై అవగాహన పెంపొందించుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బాలల హక్కులు, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, మహిళా సాధికారత అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. మాక్ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచిన బాలికలకు మెమెంటోలు అందజేసి సత్కరించారు.అలాగే మహిళా సంక్షేమ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ ప్రోగ్రామ్ ద్వారా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించిన మహిళలు, కిశోర బాలికల స్నేహ సంఘాల సభ్యులు జిల్లాలోని పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, పదాధికారులు పాల్గొన్నారు.కిశోర బాలికలలో నాయకత్వ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నిర్ణయాత్మక సామర్థ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని పాల్గొన్న బాలికలు ఆకాంక్షించారు.

# రైతు నుండి ప్రతి గింజను ప్రభుత్వం కొంటుంది

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై పాలకవర్గ సమీక్షా సమావేశం**

**రైతు సంక్షేమంపై దృష్టిని సాధించాలని సూచన**



( లోకల్ గైడ్ షాద్ నగర్) షాద్ నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ సెక్రటరీ, కమీషన్ ఏజెంట్లతో షాద్ నగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం నిర్వహించారు. మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయానికి వచ్చే రైతుల వద్ద నుండి ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మార్కెట్ మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లించి కొనడం శుభసూచకమని అన్నారు. పాలకవర్గం సూచన అధికారుల కృషి కమిషన్ ఏజెంట్ల చొరవతో ఎలాంటి ఆటంకాలు లేకుండా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తడిసిన ప్రతి గింజను కొన్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మార్కెట్ యార్డులో మౌలిక వసతులపై అభివృద్ధిపై చర్చిస్తూ రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అనుగుణంగా పరిస్థితులు ఉన్నప్పటికీ కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై బురదజల్లే పని పెట్టుకుంటున్నారని అలాంటి వారిని పట్టించుకోవద్దని తమ పని తాము చేసుకుంటూ వెళ్లిపోవాలని ఈ సందర్భంగా సూచించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే విషయాలను పరిగణలోకి తీసుకొని రాజకీయంగా చేసే విమర్శలను పట్టించుకోకూడదని పాలక కమిటీకి సూచించారు. యాడుకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా అధికారులు పాలకవర్గం కమిటీ కమిషన్ ఏజెంట్లు చొరవ చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్ భరత్ లోహోటీ, రవి నాయక్, పి నర్సింలు, కక్కునూరు సందీప్ కుమార్, వెంకట నరసింహారెడ్డి, తాడిశెట్టినవీన్, కమిషన్ ఏజెంట్లు ప్రకాష్ గుప్తా, జగదీశ్వర్ గుప్తా , కొత్ర రాజు, సరపు మల్లేష్, సంజీవయ్య, పెంటయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు..

# సిద్దిపేట కమిషనరేట్‌లో
# పదోన్నతి పొందిన పోలీసు అధికారులకు సీపీ అభినందనలు

**హోదాతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని సూచించిన సీపీ రష్మీ పెరుమాళ్**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 30:సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పదోన్నతి పొందిన పోలీసు అధికారులను పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ నుంచి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) హోదాకు పదోన్నతి పొందిన కె. మురళి, బి. రామ్ ప్రసాద్, ఎం. మధుసూదన్ రెడ్డి, అలాగే ఏఎస్ఐ నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) హోదాకు పదోన్నతి పొందిన మహమ్మద్ బాకీ, యు. నాగేశ్వర్ రావు, జె. జగదీశ్వర్, బి. వెంకటరమణ రెడ్డి లను సీపీ అభినందించారు.ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా మరింత బాధ్యతను కూడా తీసుకువస్తాయని పేర్కొన్నారు. ప్రమోషన్ పొందిన అధికారులు రెట్టింపు ఉత్సాహంతో, ప్రజా సేవే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు.పోలీస్ శాఖలో క్రమశిక్షణ, బాధ్యత, విధుల పట్ల నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఆమె అన్నారు. పెరిగిన బాధ్యతలకు అనుగుణంగా ప్రజలకు మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొని పదోన్నతి పొందిన అధికారులకు అభినందనలు తెలిపారు.

# ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు
# రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్,పెండింగ్ ప్రాజెక్టు లు వేగవంతం

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ కు శంకుస్థాపన చేసిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీహరి,రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నా రెడ్డి



మహబూబ్నగర్ మే 30 (లోకల్ గైడ్ ప్రతినిధి జీవి గౌడ్). ఉప్పడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ బిరిగేషన్ ప్రాజెక్టు తో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టు లు వేగవంతం చేసి చరిత్ర లో నిలిచి పోయే విధంగాకాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శనివారంమహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లో దేవరకద్ర మండలం లో 32.05 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య శాఖ,పాడి అభివృద్ధి,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని,ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వలన అజిలా పురం,గద్దె గూడెం, వెంకటాయ పల్లి గ్రామాలకు 1400 ఎకరాల ఆయకట్టుకు కోయిల్ సాగర్ సోర్స్ నుండి సాగు నీరు అందుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కు ప్రాధాన్యత నిచ్చి ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తో పాటు కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,తదితర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని తెలిపారు పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని చెప్పటం అబద్ధం అన్నారు ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదని అన్నారుజూన్ 4,5 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తో పాటు తాను ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న లైఫ్ ఇరిగేషన్ పనులు,పెండింగ్ పనులు పరిశీలించి అవసరమైన నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ 4 న జూరాల నుండి ప్రారంభించి 4,5 తేదీల్లో కల్వకుర్తి,, నెట్టెంపాడు,భీమా,నార్లాపూ,ర్,ఉద్దండా పూర్ రిజర్వాయర్ లను సి. ఎం.,తాను పర్యటించి భూ సేకరణ,పెండింగ్ పనులకు ఎన్ని వేల కోట్ల నిధులైనా మంజూరు చేసి పూర్తి చేయ నున్నట్లు తెలిపారు.ఇరిగేషన్ ప్రాజెక్ట్ ల నిర్మాణం భూ సేకరణకు,ఆర్ఆర్,పెండింగ్ బిల్లులు నిధులు విడుదల చేసి ఇరిగేషన్ ప్రాజెక్ట్ పెండింగ్. పనులు,పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొడంగల్ నారాయణ పేట,కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,కోయిల్ సాగర్,పాల మూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పెండింగ్ పనులు ప్రభుత్వం వచ్చే రెండున్నర సంవత్సరం ల కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు.స్థానిక శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి కోరిన విధంగా చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తానని సానుకూలంగా స్పందించారు దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ కోయిల్ సాగర్ కాలువల మరమ్మతులకు 150 కోట్లు మంజూరు చేయాలని,22 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరు. అందించ వచ్చని తెలిపారు87 కోట్ల రూలు చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కు ప్రతిపాదనలు పంపాం అనుమతులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎస్.పి.డి.జానకి,సర్పంచ్ అనంతమ్మ, మాజీ జడ్.పి చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



### కొనుగోలు కేంద్రం సందర్శన

అజిలా పూర్ శివార్ లో ఏర్పాటు చేసిన పి. ఏ సి.ఎస్.కొనుగోలు కేంద్రం ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీ హరి లు సందర్శించారు.కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు,ఎం.ఎస్.పి చెల్లింపు పై రైతులతో మాట్లాడారు..కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ ఎం.ఎస్.పి.రైతుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వారు సంతోషంతో మంత్రులకు వివరించారు.

# అమ్మ మాట -- అంగన్వాడి బాట"కు విశేష స్పందన

**2,753 మంది కొత్త చిన్నారుల నమోదు.. 52 వేల మందికి పైగా చిన్నారులకు యూనిఫారాల పంపిణీ**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే30:99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమ్మ మాట -- అంగన్వాడి బాట" కార్యక్రమానికి సిద్దిపేట జిల్లాలో విశేష స్పందన లభించింది. అంగన్వాడి సేవల ప్రాముఖ్యత, బాలల ప్రారంభ విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ మరియు చిన్నారుల సమగ్ర అభివృద్ధిపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సిద్దిపేట ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా సంక్షేమ అధికారి సి.హెచ్. శారద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె ర్యాలీలో పాల్గొని అంగన్వాడి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల ఫలితంగా 2,753 మంది కొత్త చిన్నారులు అంగన్వాడి కేంద్రాల్లో నమోదు కాగా, 52,404 మంది చిన్నారులకు యూనిఫారాలు పంపిణీ చేశారు. అలాగే చిన్నారుల విద్యారంభాన్ని ప్రోత్సహిస్తూ 2,266 మంది పిల్లలకు విద్యారంభ్ సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్వాడి కేంద్రాలను పరిశుభ్రంగా, చిన్నారులకు అనుకూలంగా తీర్చిదిద్దే క్రమంలో 1,110 కేంద్రాల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.అదేవిధంగా అంగన్వాడి సేవలు, బాలల పోషణ, ప్రీ-స్కూల్ విద్య ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జిల్లాలో 851 అవగాహన ర్యాలీలు నిర్వహించగా, వాటిలో 12,782 మంది ప్రజలు పాల్గొన్నారు. తల్లిదండ్రులకు నేరుగా అవగాహన కల్పించేందుకు అంగన్వాడి సిబ్బంది 5,101 గృహ సందర్శనలు నిర్వహించి, చిన్నారుల నమోదు, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ మరియు అంగన్వాడి సేవల వినియోగంపై వివరించారు.ఈ కార్యక్రమాల ద్వారా అంగన్వాడి కేంద్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరగడంతో పాటు చిన్నారుల నమోదు, సేవల వినియోగం గణనీయంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. బాలల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన ప్రారంభ విద్య, మెరుగైన పోషణ లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని జిల్లా సంక్షేమ అధికారి సి.హెచ్. శారద పేర్కొన్నారు.

# 'రహదారి వీరుల' పథకంపై కలెక్టర్ సమీక్ష:
# ప్రమాద బాధితులను కాపాడితే రూ. 25,000 బహుమతి



కామారెడ్డి జిల్లా మే 30 లోకల్ గైడ్ :రహదారి ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు ఉద్దేశించిన 'రహదారి వీరుల' (రహవిర్) పథకాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ పథకం అమలు తీరు పై ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ప్రజలు తక్షణమే స్పందించి బాధితులకు సాయం చేయాలని, ప్రతి ఒక్కరూ 'రహదారి వీరులు'గా మారాలని పిలుపునిచ్చారు. ప్రమాదంలో ఉన్నవారిని సకాలంలో కాపాడిన వారికి ప్రభుత్వం తరపున రూ. 25,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు.జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటుఈ పథకాన్ని పారదర్శకంగా పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో 'డిస్ట్రిక్ట్ అప్రిసియేషన్ కమిటీ ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, సభ్యులుగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ , జిల్లా రవాణా అధికారి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, బాధ్యతలు నిర్వర్తిస్తారని ఆయన వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, బాధితులకు తక్షణ వైద్యం అందేలా చూసేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు
# సాధించిన సింగరేణి కార్మికుడు...



బెల్లంపల్లి (లోకల్ గైడ్)బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2ఇంక్లైన్ బస్తీకి చెందిన సింగరేణి కార్మికుడు,శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్ గా విధులు నిర్వర్తిస్తున్న మంతెన భాస్కర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు.ఫిబ్రవరి 2న హైదరాబాద్లోని జొరాస్ట్రియన్ క్లబ్ లో గిన్నిస్ బుక్ ప్రతినిధుల ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ సమన్వయంతో జరిగిన సంగీత కార్యక్రమంలో 22దేశాల నుండి సుమారు 2వేల మంది కీబోర్డు సంగీత వాయిద్యకారులు ఏకకాలంలో ప్రదర్శన నిర్వహించారు.అందులో అత్యద్భుతంగా ప్రతిభ కనపరచిన కొంతమందిని నిర్వాహకులు గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేశారు.వారిలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు మంతెన భాస్కర్ గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించడం విశేషం,ఆయనకు ఈనెల 29న హైదరాబాదులోని గచ్చిబౌలి విక్టరీ ఆడిటోరియంలో జరిగిన గిన్నిస్ అచీవర్స్ మీట్ కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండంగి,గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్,మెడల్ అందజేశారు.

### కష్టాల్లోనుండి కార్మికుడిగా.
### ఇష్టపడి కీబోర్డు ప్లేయర్ గా ఎదిగిన మంతెన భాస్కర్...

బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన మంతెన రాజయ్య పోసమ్మ దంపతుల 3వ సంతానమే మంతెన భాస్కర్,అన్న రమేష్,అక్క రమ,తమ్ముడు సంజీవ్ లు ఉన్నారు.పదేళ్ల వయసులోనే1996లో తండ్రి రాజయ్య శాంతిఖనిలో గని ప్రమాదంలో మృతి చెందారు.అప్పట్నుండి తల్లి పోసమ్మే 4గురు పిల్లలను ధైర్యంతో పెంచి పెద్ద చేస్తు వచ్చింది.అన్న రమేష్ కు వారసత్వంగా తండ్రి ఉద్యోగం వచ్చింది.రమేష్ తన చెల్లెలు,ఇద్దరు తమ్ముళ్లకు తండ్రి స్థానంలో ఉండి తన వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగం చేసి ఎన్నో కష్టాలు పడి చదివించాడు.ఎన్నో అవమానాలు ఆర్థిక ఇబ్బందులను దాటుకుంటు రమేష్ తన తల్లి సహకారంతో చెల్లెల్ని తమ్ముళ్లను ఏ లోటు లేకుండా చూసుకున్నారు.ఈ కష్టాల్ని,త్యాగాల్ని గమనిస్తు పెరుగుతూ వచ్చిన భాస్కర్ ఉన్నత విద్యను చదువుకొని సింగరేణి సంస్థ 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ లో ఎలక్ట్రిషియన్ గా ఉద్యోగం సాధించాడు.2018లో శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్ గా విధుల్లో చేరారు.2023లో సుప్రియను వివాహమాడారు.వీరికి కుమారుడు లియోనార్డో ఉన్నాడు.గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు కుటుంబసభ్యులు ఎంతగానో అభినంధించారు.ఆనందంలో కుటుంబసభ్యులు సంబారాలు చేసుకున్నారు.ఆయన పనిచేస్తున్న సింగరేణి సంస్థ ఉన్నత అదికారులు,శాంతిఖని గని అధికారులు,తోటి కార్మికులు,యూనియన్ నాయకులు,బంధువులు,మిత్రులు ప్రశంసించారు.

# జంగారెడ్డిగూడెంమండలం
# గురవాయి గూడెం లో జరగబోవు

మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయ చైర్మన్ కమిటీ సభ్యులకు ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమం



ఏలూరు జిల్లా ,జంగారెడ్డిగూడెం ,మే 30 జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో జరుగబోవు శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయ చైర్మన్ మరియు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార



మహోత్సవ కార్యక్రమానికి చింతలపూడి శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించబడుతున్న ఈ మహోత్సవానికి హాజరుకావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆలయ అభివృద్ధి మరియు ధార్మిక సేవలకు తమ వంతు సహకారం అందించేందుకు అందరూ సంకల్పబద్ధంగా ఉన్నారు.గురవాయిగూడెం గ్రామంలో జరగనున్న ఈ ఆధ్యాత్మిక వేడుక భక్తులను, ప్రజాప్రతినిధులను, పార్టీ శ్రేణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే విశిష్ట కార్యక్రమంగా నిలవనుంది.

# బాదుడే బాదుడు దొరికినంత దోచుకో
# ద్వారకాతిరుమల బ్రాందీ షాపుల దోపిడి



గోపాలపురం నియోజకవర్గం ప్రతినిధి . మే 30 మండల కేంద్రమైన ద్వారకాతిరుమల అంబికా వైన్స్ బ్రాందీ షాప్ లో కథ కొంతకాలంగా ఎంఆర్పి పై పది రూపాయలు ఎక్కువ తీసుకునేవారు అసలే ధరలు ఎక్కువ ఉన్న కష్టపడేవారు అలవాటు ఉన్నవారు. వారు



ఎంతంటే అంత ఇచ్చి ప్రజలు తీసుకునేవారు. ఎమ్మార్పీ 200 రూపాయలు ఉంటే గతంలో 210 రూపాయలు తీసుకునేవారు ఏమిటి అని ప్రశ్నించగా ఇది అంతే మేము ఇలాగే తీసుకుంటాం కావాలంటే తీసుకోండి లేకపోతే వెళ్ళిపోండి. మీరేకచిత్రం లేక ప్రజలు పది రూపాయలు ఎక్కువ ఇచ్చి తీసుకుంటున్నారు. ఈరోజు నుంచి మరొక పది రూపాయలు పెంచారు ఎమ్మార్పీ దొరకంటే 20 రూపాయలు అదనంగా తీసుకుంటున్నారు ఏమిటి అని అడగగా మా ఇష్టం మా ఇష్టం వచ్చినట్టు తీసుకుంటాం మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు మీరు ఎవరు కంప్లైంట్ చేసుకుంటారో చేసుకోండి మీకు నచ్చిన వారికి చెప్పుకోండి మీరు ఏమైనా చేసుకోండి ఎంతైనా మా ఇష్టం మీకు కావాలంటే తీసుకోండి లేకపోతే వెళ్ళిపోండి. అని ప్రజలపై కోప్పడుతున్నారు. కంప్లైంట్ ఇస్తారా ఇవ్వండి మాకు ఏం కాదు మమ్మల్ని ఎవరు అడగరు ఇది ఎక్కడ న్యాయం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే ద్వారకాతిరుమల బ్రాందీ షాపులపై తకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా
# ప్రజా దర్బార్ -- కర్రోతు బంగార్రాజు



నెల్లిమర్ల నియోజకవర్గ మే 30 భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ ఉ నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తన నివాసం వద్ద ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్వహించిన



(ప్రజా దర్బార్)కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు.వినతుల్లో భూ సమస్యలు, సీసీ రోడ్లు, కాలువలు, విద్యుత్ సమస్యలు, గత ప్రభుత్వంలో ఉపాధి కోల్పోయిన బాధితుల సమస్యలు, గ్రామాల్లో మౌలిక వసతుల కొరత, రీ-సర్వే వల్ల ఏర్పడిన పొరపాట్లు, అలాగే ఎయిర్‌పోర్టులో ఉపాధి అవకాశాల కోసం దరఖాస్తులు ప్రధానంగా ప్రస్తావించబడ్డాయి.ఈ సందర్భంగా కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల
# సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి ---సిపిఎం



కళ్యాణదుర్గం మే 30:కళ్యాణదుర్గం పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలకు కు సిపిఎం పార్టీ మద్దతు తెలియజేసినట్లు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి ..ప్రధానంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచాలి కార్మికులు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత వారం రోజులుగా దీక్షలు నిర్వహిస్తుంటే కనీసం వారి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేయకపోడం ప్రభుత్వానికి తగదు.. ఏదైతే మున్సిపల్ కార్మికులు ఉద్యోగ సమయంలో ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబం రోడ్డున పడే పరిస్థితులు చూస్తున్నం అలాంటి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని కోరుతున్నాం.చనిపోయిన కార్మికుల కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కోరుతున్నాం.. ప్రధానంగా మున్సిపాలిటీ పట్టణ విస్తరణ కు అనుగు కార్మికుల సంఖ్య పెంచాలని ,కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు స్వంత ఇంటి స్థలం, ఇళ్ళు ఇవ్వాలని,కార్మికులకు పనిముట్లు సకాలంలో అందించాలని కోరుతున్నాం..ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయడానికి కృషి చేయాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాం.కార్యక్రమంలో వన్నూరుస్వామి, నట్రాజ్, శేషాద్రి,తిప్పేస్వామి, వన్నూరుస్వామి.జె ,లక్ష్మన్న దుర్గమ్మ,ఎల్లక్క తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి వెంకటరమణప్పకు నివాళి అర్పించిన ఎమ్మెల్యే అమిలినేని



ఎస్సార్పీ చైర్మన్ ముత్తినేని రాజగోపాల్, టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం మే 30:తుమకూరు జిల్లా పావగడకు చెందిన మాజీ మంత్రి వెంకటరమణప్ప స్వర్గస్థులయ్యారని తెలుసుకుని నేడు వారి స్వగృహంలో వెంకటరమణప్ప భౌతికకాయానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు,ఎస్సార్పీ చైర్మన్ ముత్తినేని రాజగోపాల్,టీడీపీ నాయకులు

### చరిత్రను మరువొద్దు.బానిసలుగా మిగలొద్దు!

### గతాన్ని విస్మరిస్తే.భవిష్యత్తు శూన్యం!

కళ్యాణదుర్గం ఆర్టిఐ ఎక్స్ ప్రెస్ న్యూస్ మే 30:మనం కోట్లు సంపాదిస్తున్నా, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నా, రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్నా, సమాజంలో తల ఎత్తుకుని తిరుగుతున్నా.దీని వెనుక ఒక సుదీర్ఘమైన పోరాటం ఉంది. మన ముత్తాతలు, తాతలు పడిన అవమానాలను తుడిచిపెట్టడానికి కొందరు మహానుభావులు తమ జీవితాలనే త్యాగం చేశారు!

### భగవాన్ బుద్ధుడు ప్రసాదించిన సమతా మార్గం.

మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన అక్షర ఆయుధం.విశ్వరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ కలం నుండి జాలువారిన "భారత రాజ్యాంగం,వీటి ఫలితమే నేటి ఎస్.సి ఎస్.టీ బి.సి మైనారిటీల మరియు మహిళల ఆత్మగౌరవ జీవితం! కానీ ఈరోజు మన పరిస్థితి ఏమిటి? సౌకర్యాలు రాగానే మూలాలను మర్చిపోతున్నాం. కుర్చీ దక్కగానే, ఆ కుర్చీని ప్రసాదించిన 'రాజ్యాంగ నిర్మాత'ను విస్మరిస్తున్నాం. కృతజ్ఞత లేని సమాజం ఎక్కువ కాలం స్వేచ్ఛగా బతకలేదు!చరిత్రను మరిచిపోయినవాడు చరిత్రను సృష్టించలేడు.బాబాసాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ఇప్పుడైనా మేల్కొందాం, మన పిల్లలకు మన పూర్వీకుల పోరాట చరిత్రను నేర్పుదాశీ నాడు మహానుభావులు త్యాగం చేస్తే.నేడు మనం కనీసం .కృతజ్ఞత" కలిగి ఉందాం.హక్కులను వాడుకుంటూనే, సామాజిక బాధ్యతను గుర్తుంచుకుందాం.మీ చదువు, ఉద్యోగం,వ్యాపారం కేవలం మీ కుటుంబం కోసమే కాదు... మిమ్మల్ని ఈ స్థాయికి తెచ్చిన సమాజం కోసం కూడా!జేఏసీ చెలిమప్ప ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక కార్య కర్త

# 56 మందికి ముఖ్యమంత్రి
# సహాయనిది చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి





విజయవాడ మే 30(పశ్చిమ నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న 56 మందికి ఎమ్మెల్యే సుజనా చౌదరి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు.శనివారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో 56 మంది లబ్దిదారులకు రూ 29 లక్షల 70 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా పశ్చిమలో పెద్ద ఎత్తున ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.ముందస్తు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. రెండేళ్ల పాలనలో పశ్చిమాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నామని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూ పార్టీలకతీతంగా సేవలనందిస్తున్నామన్నారు. పశ్చిమ అభివృద్ధికి మరింత మెరుగైన పాలనకు ప్రతి ఒక్కరు సలహాలు సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే సుజనా కోరారు.ఈ కార్యక్రమంలో నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, దుర్గమ్మ గుడి మాజీ చైర్మన్ పైలా సోమి నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కోగంటి రామారావు, మాజీ కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, యేదుపాటి రామయ్య,మహాదేవు అప్పాజీరావు, అత్తలూరి ఆదిలక్ష్మీ పెదబాబు, మైలవరపు దుర్గారావు, మరుపిళ్ళ రాజేష్, గుడివాడ నరేంద్ర రాఘవ, సయ్యద్ అబ్దుల్ ఖాదర్, పత్తి నాగేశ్వరరావు,అలుగుండ్ల సుబ్బారెడ్డి, జనసేన నేతలు తిరుపతి సురేష్, తిరుపతి అనూష, బొల్లేపల్లి కోటేశ్వరరావు, ఏలూరు సాయి శరత్,బీజేపీ నేతలు దుర్వేసుల హుస్సేన్ పోతిన భేసు కంటేశ్వరుడు,పచ్చి పులుసు వెంకట శివప్రసాద్, పిట్టల గోవిందు పైలా సురేష్,కందుల సుబ్రమణ్యేశ్వరరావు,రుద్రపాటి వెంకటేష్, పగడాల కృష్ణ, బెన్నా భక్తుల సోమేశ్వరరావు, షేక్ మధు మస్తాన్, మంగళపురి మహేష్, గడ్డిపాటి కిరణ్,ఏ ఈ జాస్మిన్, అమెనిటీస్ సెక్రటరీ గీతిక, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# చరిత్రను మరువొద్దు.బానిసలుగా మిగలొద్దు!
# గతాన్ని విస్మరిస్తే.భవిష్యత్తు శూన్యం!



కళ్యాణదుర్గం మే 30:మనం కోట్లు సంపాదిస్తున్నా, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నా, రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్నా, సమాజంలో తల ఎత్తుకుని తిరుగుతున్నా.దీని వెనుక ఒక సుదీర్ఘమైన పోరాటం ఉంది. మన ముత్తాతలు, తాతలు పడిన అవమానాలను తుడిచిపెట్టడానికి కొందరు మహానుభావులు తమ జీవితాలనే త్యాగం చేశారు!భగవాన్ బుద్ధుడు ప్రసాదించిన సమతా మార్గం.మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన అక్షర ఆయుధం.విశ్వరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ కలం నుండి జాలువారిన "భారత రాజ్యాంగం,వీటి ఫలితమే నేటి ఎస్.సి ఎస్.టీ బి.సి మైనారిటీల మరియు మహిళల ఆత్మగౌరవ జీవితం! కానీ ఈరోజు మన పరిస్థితి ఏమిటి? సౌకర్యాలు రాగానే మూలాలను మర్చిపోతున్నాం. కుర్చీ దక్కగానే, ఆ కుర్చీని ప్రసాదించిన 'రాజ్యాంగ నిర్మాత'ను విస్మరిస్తున్నాం. కృతజ్ఞత లేని సమాజం ఎక్కువ కాలం స్వేచ్ఛగా బతకలేదు!చరిత్రను మరిచిపోయినవాడు చరిత్రను సృష్టించలేడు.బాబాసాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ఇప్పుడైనా మేల్కొందాం, మన పిల్లలకు మన పూర్వీకుల పోరాట చరిత్రను నేర్పుదాం నాడు మహానుభావులు త్యాగం చేస్తే.నేడు మనం కనీసం .కృతజ్ఞత" కలిగి ఉందాం.హక్కులను వాడుకుంటూనే, సామాజిక బాధ్యతను గుర్తుంచుకుందాం.మీ చదువు, ఉద్యోగం,వ్యాపారం కేవలం మీ కుటుంబం కోసమే కాదు... మిమ్మల్ని ఈ స్థాయికి తెచ్చిన సమాజం కోసం కూడా!జేఏసీ చెలిమప్ప ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక కార్య కర్త

# ప్రజా దర్బార్‌కు విశేష స్పందన... ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కట్టుబాటు

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన -- సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

నెల్లిమర్ల నియోజకవర్గం మే 30)నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని,వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కు వినతిపత్రాలు సమర్పించారు.ఈ ప్రజా దర్బార్‌లో ప్రధానంగా ఈ క్రింది సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు: ౧ భోగాపురం భూసేకరణ సమస్యలు: భోగాపురం విమానాశ్రయం భూసేకరణకు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బందులను,తమకు జరగాల్సిన న్యాయాన్ని వివరిస్తూ బాధిత రైతులుఅవినతిపత్రం అందజేశారు. ఆయుష్ ఆరోగ్య మందిరాల విలీనంపై అభ్యంతరం: పేరాపురం, వెంపడం, సి.హెచ్. అగ్రహారం గ్రామాల్లోని ఆయుష్ ఆరోగ్య మందిరాలను రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలీనం చేయవద్దని, దీనివల్ల స్థానికంగా వైద్య సేవలు దూరమవుతాయని ప్రజలు కోరారు౨ రెవెన్యూ, పెన్షన్ సమస్యలు: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు,అలాగే అర్హులైనప్పటికీ వివిధ కారణాల వల్ల పెన్షన్లు అందని లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ౩ ఉపాధి, మౌలిక వసతులు: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరగా,పలు గ్రామాల ప్రజలు తమ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు.ముఖ్యంగా భోగాపురం రైతుల భూసేకరణ సమస్యలు, ఆయుష్ కేంద్రాల విలీనంపై వచ్చిన వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే రెవెన్యూ,రోడ్లు,విద్యుత్,పెన్షన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి పాలిటెక్నిక్ విద్యార్థుల విజయభేరీ...
# మైనింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో అగ్ర ర్యాంకులు...





మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తెలంగాణ ఈసెట్ 2026లో మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించారు.కళాశాల విద్యార్థులు రాష్ట్రంలో 1,2,5వ ర్యాంకులను కైవసం చేసుకొని కళాశాలకు విశేష ఖ్యాతిని గడించారు.ఈ సందర్భంగా1వ ర్యాంకు సాధించిన సామల మహేష్ మాట్లాడుతు తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం,కళాశాల ప్రిన్సిపల్ ఎం దేవేందర్,మైనింగ్ విభాగ అధ్యాపకులు అందించిన ఉత్తమ శిక్షణే కారణమని తెలిపారు.భవిష్యత్తులో గేట్ లో అగ్ర ర్యాంకు సాధించి ఐఐటిలో ఉన్నత విద్యను అభ్యసించి,సింగరేణి,కోల్ ఇండియా వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో మైనింగ్ ఇంజినీర్‌గా సేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.2వ ర్యాంకు సాధించిన మొహమ్మద్ ఖాజీముద్దీన్ మాట్లాడుతు



బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అందించిన విద్యా వాతావరణం,ప్రిన్సిపల్ ప్రోత్సాహం,హెచ్ఓడి ఆంథోనీ మార్గదర్శకత్వం,అధ్యాపకుల అంకితభావంతో కూడిన బోధన తన విజయానికి ప్రధాన కారణమని తెలిపారు.భవిష్యత్తులో సమర్థవంతమైన మైనింగ్ ఇంజినీర్‌గా ఎదిగి గనుల రంగ అభివృద్ధికి సేవలందించేందుకు కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.5వ ర్యాంకు సాధించిన కె సాయి చరణ్ మాట్లాడుతు ఇంటర్మీడియట్‌కు బదులుగా పాలిటెక్నిక్ విద్యను ఎంచుకోవడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం,కళాశాల అధ్యాపకుల మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందన్నారు.తన జీవితంలో ఈ విజయానికి కళాశాల చేసిన సేవలను ఎప్పటికీ మరువలేనని,భవిష్యత్తులో కోల్ ఇండియా సిఎండి స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం దేవేందర్,అధ్యాపకులు మాట్లాడుతు విద్యార్థుల కృషి,అధ్యాపకుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకార ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.రాష్ట్ర స్థాయిలో మైనింగ్ విభాగంలో 1,2,5వ ర్యాంకులతో పాటు టాప్ 30లో సుమారు15ర్యాంకులు సాధించడం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచిందని పేర్కొన్నారు.కళాశాల అధ్యాపకులు,సిబ్బంది,విద్యార్థులు తల్లిదండ్రులు విజేతలను అభినందించి వారి భవిష్యత్తు ఉన్నత విజయాలతో నిండాలని ఆకాంక్షించారు.

## 'సీఎం' గొడవ అయిపోయింది.. ఇప్పుడు 'డిప్యూటీ సీఎం' కోసం..



బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్య తప్పుకోవడంతో డీకే శివకుమార్ త్వరలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పదవి కోసం కొందరు నేతలు పోటీ పడుతున్నారు. ఉప ముఖ్యమంత్రిగా మాజీ మంత్రి కేహెచ్ మునియప్పను నియమించాలని కోరుతూ దళిత వర్గ నేతలు శనివారం కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నిరసన చేపట్టారు. మడార మహాసభ, పలు దళిత సంఘాల నేతలు పోస్టర్లు ప్రదర్శిస్తూ మునియప్పకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరారు. రాష్ట్రానికి చేరుకుంటున్న ఏఐసీసీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలాకు వినతిపత్రం అందించేందుకు నిరసనకారులు అక్కడికి వెళ్లారు. విమానాశ్రయంలోని టెర్మినల్ 1 వద్ద ఈ నిరసన కొన్ని గంటల పాటు కొనసాగింది. మడిగ వర్గానికి ఇప్పటివరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు వంటి కీలక పదవులు దక్కలేదని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి ఉప ముఖ్యమంత్రి పదవి ద్వారా తమ వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం తప్పదని హెచ్చరించారు. తమ వర్గాన్ని పట్టించుకోకపోతే పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్ సుర్జేవాలా నగరంలోని షాంగ్రి లా హోటల్‌కు చేరుకున్నారు. కర్ణాటక కాంగ్రెస్ శాసనసభ పక్షం (సీఎల్పీ) సమావేశంపై మునియప్ప మాట్లాడుతూ.. "కొంతమంది ప్రతిపాదిస్తున్నారు, మరికొందరు బలపరుస్తున్నారు. ఇదే విధానం. దీని కంటే ఎక్కువగా ఇప్పుడేమీ చెప్పలేం. అయితే ఈ ప్రక్రియ ఈ సాయంత్రానికే పూర్తవుతుంది" అని తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వంపై ఒత్తిడి లింగాయత్ వర్గం నుంచి కూడా వచ్చింది. సీనియర్ నేత ఈశ్వర్ ఖండ్రేకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని గురు బసవ పట్టదేవరు, ఆయన అనుచరులు డిమాండ్ చేశారు. గురు బసవ మీడియాతో మాట్లాడుతూ.. "ఈశ్వర్ ఖండ్రేకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోతే వచ్చే శాసనసభ ఎన్నికల్లో లింగాయత్ వర్గం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుంది" అని అన్నారు. కాగా, కర్ణాటకలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రుల పేర్లు ప్రకటించే అవకాశం ఉంది.

## రాజస్థాన్‌లో రాకాసి ఇసుక తుపాను బీభత్సం



చురు జిల్లా: రాజస్థాన్‌లో రాకాసి ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. చురు జిల్లాలో ఇసుక తుపాన్‌తో పాటు భారీ వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చురు, బికనేర్, శ్రీగంగానగర్‌లో అరగంట పాటు ఇసుక తుపాన్ అల్లకల్లోలం సృష్టించింది. ఇసుక తుపాను వీధులను కమ్మేసింది. భారీ దుమ్ము కమ్మేయడంతో విజిబిలిటీ తగ్గిపోయింది. సోషల్ మీడియాలో దుమ్ము తుపాను సంబంధించి వీడియోలు వైరల్‌గా మారాయి. వీధుల గుండా బలమైన ఈదురుగాలులు, దట్టమైన దుమ్ము మేఘాలు కనిపించాయి. దీంతో ఆకాశం ముదురు నారింజ-గోధుమ రంగులోకి మారిపోయింది. ఒక్కసారిగా ఇసుక తుపానుతో ప్రయాణికులు స్థానికులు ఇళ్లలోనే ఆశ్రయం పొందారు. ఈదురుగాలుల ధాటికి చెట్లు నేలకొరిగాయి. ఈ ప్రాంతంలో తీవ్రమైన ఎండల తర్వాత బలమైన గాలులు, దుమ్ము తుపానులు ముంచెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర భారతదేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఎడారి వేడి గాలులు పరస్పరం చర్య జరిపినప్పుడు.. ముఖ్యంగా రుతుపవనాల ముందు వచ్చే ముందు రాజస్థాన్‌లో ఇటువంటి దుమ్ము తుపానులు సహజమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇసుక తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టంపై ఎలాంటి నివేదికలు అందలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తక్కువ విజిబిలిటీ ఉన్న సమయంలో అనవసరమైన ప్రయాణాలను చేయొద్దని.. వీలైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు, దుమ్ము లేచే పరిస్థితులు ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

## ఏపీకి బిగ్ అలర్ట్.. ఆ జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక



అమరావతి: రాయలసీమ జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది. రాగల మూడు గంటల్లో నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. 50-60కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని.. చెట్లు, పోల్స్, హోర్డింగ్స్ కింద నిలబడరాదని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. కాగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జూన్‌లోనూ వడగాడ్పుల రోజులు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇరు రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు రికార్డవుతాయని అంచనా వేసింది. ఏపీతోపాటు యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లలో సాధారణం కంటే ఎక్కువ వడగాడ్పుల రోజులు నమోదవుతాయని.. మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లోనూ వడగాడ్పుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంకన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని ఐఎండీ తెలిపింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా రుతుపవనాల వర్షపాత దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో 90 శాతంగా ఉండే అవకాశం ఉందని.. ఇది ఏప్రిల్‌లో అంచనా వేసిన 92 శాతం కంటే కూడా తక్కువని తాజా అంచనాలో పేర్కొంది. ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతుపవనాలపై పడటంతో మధ్యభారత్ సహా దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు, దేశ వాయవ్య ప్రాంతంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.ు

## తెలంగాణ భవన్ వద్ద హైడ్రామా.. బాల్క సుమన్ అరెస్ట్



హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో బాల్క సుమన్‌పై పలు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో తెలంగాణభవన్‌లో ఉన్న బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నరు. ఈ సందర్భంగా తెలంగాణభవన్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం, బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గత మూడు రోజులుగా తెలంగాణ భవన్‌లోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణభవన్ వద్దనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత మూడు రోజులుగా మోహరించారు. బాల్క సుమన్ భవన్ నుండి బయటికి వస్తే అరెస్టు చేయాలన్న ఆలోచనలో పోలీసులు ఉన్నారు. ఈ క్రమంలో కాసేపటి క్రితమే సుమన్ తరపు లాయర్ అక్కడికి చేరుకున్నారు. అలాగే, నాంపల్లి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. సుమన్‌కు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు.. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు పోలీసులు. ?326, 351, 352, 353, 355, 361-దీమీ మరియు ాణూూ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ?పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉన్న సెక్షన్లను కేసులో చేర్చిన పోలీసులు. దీంతో, పోలీసులతో బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వాగ్వాదానికి దిగారు. సుమన్‌పై అక్రమ కేసులు పెట్టారంటూ లాయర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ?నాంపల్లి కోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకుంటామంటున్నారు. ?అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, న్యాయస్థానాల్లోనే తేల్చుకుంటామని న్యాయవాదుల హెచ్చరించారు. ఈ క్రమంలో ?భవన్ వద్ద పోలీసులకు, లాయర్లకు మధ్య చర్చలు, వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. భవన్ వద్ద భారీగా మోహరించిన పోలీసులతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# ప్రపంచాన్ని గెలిచారు.. ఇక మాతృభూమిని నడిపించండి!

'అమెరికా ఫస్ట్' నినాదంతో విదేశీయుల వల్ల స్థానికులకు ఉద్యోగాలు దక్కడం లేదనే వాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బలంగా వినిపిస్తుంటారు. ఈ క్రమంలోనే హెచ్-1బి వీసా నిబంధనలను కఠినతరం చేయడం, గ్రీన్ కార్డ్ జారీ ప్రక్రియలో జాప్యం వంటి నిర్ణయాలతో ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులను ఇబ్బందులకు గురిచేసే వ్యూహాన్ని అమెరికా అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, అమెరికాలో స్థిరపడిన భారతీయ మేధావులను, ప్రముఖ కంపెనీల సీఈవోలను 'తిరిగి భారత దేశానికి వచ్చేయండి.. ఇక్కడే అద్భుతాలు సాధించండి' అంటూ మన రాజకీయ శ్రేణుల నుంచి, సామాజిక మాధ్యమాల నుంచి పిలుపులు అందుతున్నాయి. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల సహా పలువురు గ్లోబల్ కంపెనీల సీఈవోలు ఇకనైనా ఇండియాకు రండి అని ఒక సీనియర్ పాత్రికేయుడు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే ఇవన్నీ భావోద్వేగపూరితమైన భ్రమలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే, విదేశాల్లోని మేధావులను ఆకర్షించడమనేది కేవలం పిలుపులతోనే సాధ్యం కాదు.. దానికి తగ్గ పారిశ్రామిక, పరిపాలనా పరమైన ఎకో సిస్టమ్ ఇక్కడ సిద్ధంగా ఉండాలి.

### చరిత్ర నేర్పిన పాఠాలు.. మారుతున్న కాలం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో విదేశాల్లో చదువు కున్న, స్థిరపడిన అనేకమంది మేధావులు మాతృభూమిపై మమకారంతో భారతదేశానికి తిరిగి వచ్చారు. నాటి హోమీ జహంగీర్ బాబా, విక్రమ్ సారాభాయ్ వంటి దిగ్గజాలు ఇక్కడికి వచ్చి అణుశక్తి, అంతరిక్ష రంగాలకు పునాదులు వేశారు. నాటి ప్రభుత్వాలు కూడా వారి ఆలోచనలకు పూర్తి స్వేచ్ఛను, గౌరవాన్ని ఇచ్చి ప్రోత్సహించాయి. అయితే, ఆ తర్వాత దశాబ్దాలలో దేశంలో పెరిగిన రెడ్ టేపిజం, లైసెన్స్ రాజ్ మౌలిక వసతుల లేమి, రాజకీయ జోక్యం కారణంగా దేశంలో 'మేధోవలస' భారీగా పెరిగింది. లక్షలాది మంది మేధావులు అమెరికా బాట పట్టారు. నేడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో లేదా గ్లోబల్ కంపెనీలలో భారతీయుల హవా నడుస్తున్నదంటే దానికి కారణం వారి ప్రతిభతో పాటు అమెరికా కల్పించిన స్థిరమైన వాతావరణం. నాడు వారు దేశాన్ని వదిలి వెళ్లడానికి కారణమైన సమస్యలను మనం పరిష్కరించామా? లేదా అనే ఆత్మపరిశీలన చేసుకోవాల్సి ఉంది.

### బలిపశువులవుతున్న పెట్టుబడిదారులు..




ఇండియాలో పెట్టుబడిదారులను తీవ్రంగా భయపెట్టే ప్రధానాంశం 'పాలసీ అస్థిరత'. మన దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మునుపటి ప్రభుత్వం తెచ్చిన పారిశ్రామిక విధానాలు, పన్ను నిబంధనలు, సబ్సిడీలు కూడా మారిపోతుంటాయి. డాలర్లలో సంపాదిస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలతో వ్యాపారాలు చేసే ఎన్‌ఆర్‌ఐలు, పెట్టుబడిదారులు ఇలాంటి అనిశ్చితిని అస్సలు భరించలేరు. అమెరికాలో ఆంక్షలకు భయపడి లక్షల రూపాయల ప్యాకేజీలను వదులుకుని ఇండియాకు వచ్చేసిన తర్వాత.. ఇక్కడ పాలసీలు తారుమారైతే వారు లీగల్ చిక్కుల్లో పడి, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ గ్లోబల్ మేధావులను ఇక్కడికి రమ్మనడం వారిని బలిపశువులను చేయడమే అవుతుంది. కనీసం 20 ఏళ్ల పాటు మారని స్థిరమైన పారిశ్రామిక విధానాన్ని చట్టబద్ధంగా మనమూ హామీ ఇస్తేనే ఎన్నారైలు ఇటువైపు చూడగలరు.

### వర్క్‌షాపులు.. పబ్లిక్ డొమైన్‌లో సమాచారం!

విదేశాల్లో ఉన్న నిపుణులను దేశానికి రప్పించాలనే సంకల్పం ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ఒక పద్ధతి ప్రకారం హోంవర్క్ చేయాలి. దేశంలో ప్రస్తుతం ఏ రకమైన పరిశ్రమలను ప్రభుత్వం తీవ్రంగా ప్రోత్సహించాలనుకుంటోంది? ఏయే రంగాలలో శాస్త్రవేత్తలు, సాంకేతిక మేధావుల కొరత తీవ్రంగా ఉంది? అనే అంశాలపై స్పష్టమైన సర్వేలు చేయాలి. దేశంలో ఉన్న అవకాశాలను ఒక శ్వేతపత్రం రూపంలో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. అమెరికాలో సరైన వీసా అవకాశాలు లేక, నిరంతరం గ్రీన్ కార్డ్ టెన్షన్‌తో గడుపుతూ తిరిగి వచ్చేయాలని భావించే మధ్యతరగతి నిపుణులు వేలల్లో ఉన్నారు. ఇక్కడ ఏ రంగంలో అవకాశాలు ఉన్నాయో అధికారికంగా స్పష్టత ఇస్తే, కనీసం ఈ వర్గం వారైనా ధైర్యంగా ఇండియాకు వచ్చి స్థిరపడేందుకు వీలవుతుంది.

### సీఈవోలు కాదు.. జీసీసీలు కావాలి!

అంతేకానీ, గ్లోబల్ టాప్ కంపెనీ సీఈవోలను తమ ఉద్యోగాలు, బోర్డు పదవులు వదిలేసి ఇండియాకు వచ్చేయమనడం అవగాహన లేమి లేదా మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకంటే వారు గ్లోబల్ కార్పొరేట్ పబ్లిక్ లిస్టెడ్ కంపెనీల షేర్ హోల్డర్లకు జవాబుదారీగా ఉంటారు. వారు ఇండియాకు రావడం వల్ల దేశానికి వచ్చే లాభం కంటే, వారు ఉన్నత స్థానాల్లో ఉంటూ భారతదేశానికి లబ్ధి చేకూర్చే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం ఉత్తమం. దీనికి ప్రస్తుతం ఉన్న అత్యంత ఆచరణాత్మకమైన మార్గం 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్. అమెరికాలోని ప్రముఖ కంపెనీల సీఈవోలు వారి కంపెనీల తరఫున హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలలో భారీ ఎత్తున గ్లోబల్ సెంటర్లను ఏర్పాటు చేసేలా మనం ప్రోత్సాహకాలు ఇచ్చి ఆహ్వానించవచ్చు. ఈ జీసీసీల ద్వారా అమెరికా కంపెనీలు తమ అత్యున్నత సాంకేతిక పరిశోధనలను ఇక్కడి నుంచే నిర్వహిస్తాయి. మనుషులు దేశం దాటి వెళ్లకుండానే, ఇక్కడి టాలెంట్‌కు అంతర్జాతీయ స్థాయి ఉపాధి లభిస్తుంది.

### నేటికీ యువతలో డాలర్ కలలు..

మన సామాజిక వైరుధ్యాన్ని కూడా ఈ సందర్భంగా గమనించాలి. మనవాళ్లకు క్షేత్రస్థాయిలో అమెరికా మోజు ఏమాత్రం తగ్గలేదు. నేటికీ అమెరికా నుంచి ఎవరైనా బంధువులో, మిత్రులో భారతదేశానికి వస్తే, వారిని కలిసే వంద మందిలో కనీసం తొంభై మంది 'మా అబ్బాయికో, అమ్మాయికో అమెరికాలో ఏదైనా అవకాశం ఉంటే చూడండి' అని అడుగుతున్నారనేది నగ్నసత్యం. ఒకవైపు ఇక్కడి సమాజంలో అమెరికా వీసా పట్ల ఇంతటి తీవ్రమైన వ్యామోహం, ఆరాటం ఉంచుకుని, మరోవైపు అమెరికాలో ఉన్నవారిని ఇక్కడికి వచ్చేయ మనడం ద్వంద్వ నీతి అవుతుంది. భారత్ నిజంగానే గ్లోబల్ లీడర్ కావాలంటే, విదేశాల్లో ఉన్నవారిని భౌతికంగా రమ్మని కోరడం కంటే.. వారి పెట్టుబడులను, మేధస్సును, డిజిటల్ ఐడియాలను సులువుగా ఆకర్షిం చగలిగే లీగల్, పరిపాలనాపరమైన బలమైన ఎకో సిస్టమ్‌ను నిర్మించడమే ఏకైక మార్గం.

# షైనింగ్ హైదరాబాద్.. సఫరింగ్ తెలంగాణ? ఉద్యమ లక్ష్యాలకు దూరంలోనే రాష్ట్రం!



తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం కేవలం భౌగోళిక సరిహద్దుల కోసం జరిగిన పోరాటం కాదు. అది దశాబ్దాలుగా కొనసాగిన ప్రాంతీయ వివక్ష, అన్యాయం, నిర్లక్ష్యం, అవకాశాల అసమాన పంపిణీకి వ్యతిరేకంగా ప్రజలు రేపిన చారిత్రాత్మక ఉద్యమం. "మన నీళ్లు - మన నిధులు - మన నియామకాలు" అనే నినాదం వెనుక తెలంగాణ గ్రామాల బాధ, రైతు ఆవేదన, నిరుద్యోగ యువత ఆకాంక్ష, స్వాభిమానం దాగి ఉన్నాయి. రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు దాటుతున్న ఈ సమయంలో తెలంగాణ నిజంగా ఉద్యమ లక్ష్యాల దిశగా నడుస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు సమాజం ముందుంది. ఒకవైపు హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా మెరుస్తుంటే, మరోవైపు గ్రామీణ తెలంగాణ ఇంకా అప్పులు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ రంగాల బలహీనతలతో పోరాడుతోంది. అభివృద్ధి మొత్తం ఒక నగరంలోనే కేంద్రీకృతమవుతుంటే, ఉద్యమం ఆశించిన సమాన తెలంగాణ సాధ్యమవుతుందా? అన్న చర్చ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

### అభివృద్ధి చిన్న గ్రామాలకు విస్తరించాలి!

హైదరాబాద్ నేడు ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగి తెలంగాణకు ఐటీ, పెట్టుబడులు, ఉద్యోగాల్లో భారీ వృద్ధిని తీసుకొచ్చింది. కానీ ఈ అభివృద్ధి ఎక్కువగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. అంటే అభివృద్ధి రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరణ కాకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కేంద్రీకృతమవుతోంది. ప్రభుత్వాలు కూడా ఈ అభివృద్ధినే "తెలంగాణ ప్రగతి"గా ప్రజలకు చూపిస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి మొత్తం రాష్ట్రానికి సమానంగా విస్తరించిందా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సి ఉంది. విదేశీ పెట్టుబడులు, ఐటీ ఎగుమతులు, రియల్ ఎస్టేట్ బూమ్, అంతర్జాతీయ సదస్సులు ఇవన్నీ హైదరాబాద్‌కు ఒక కొత్త గుర్తింపును తెచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ అదే సమయంలో గ్రామీణ తెలంగాణ పరిస్థితి ఏమిటి? వారు ఇప్పటికీ వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. భూములు రియల్ ఎస్టేట్ వెంచర్‌లుగా మారుతుంటే, చిన్న రైతు అప్పుల కోసం తన భూమినే అమ్ముకోవాల్సి వస్తోంది. ఇది సమగ్ర అభివృద్ధి కాదు, అసమాన అభివృద్ధి. నిజమైన తెలంగాణ ప్రగతి అంటే అభివృద్ధి గ్రామాలు, చిన్న పట్టణాలకు కూడా సమానంగా విస్తరించాలి.

### యువత గిగ్ వర్క్ మీదే ఆధారపడుకుంటూ..

ప్రభుత్వ వైద్య రంగంలో పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. రాష్ట్రంలో వేలాది డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండ టంతో గ్రామీణ ప్రజలు సరైన వైద్యం కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఒకవైపు "ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిర్మిస్తున్నామని చెప్పే ప్రభు త్వాలు, గ్రామీణ ఆసుపత్రుల్లో ఒక్క డాక్టర్ కూడా లేక ప్రజలు కిలోమీటర్ల దూరం ప్రయాణించే పరిస్థితిని ఎందుకు మార్చలేకపోతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన ఉద్యోగాల హామీలపై యువత పెద్ద ఆశలు పెట్టుకుంది. కానీ నిరుద్యోగం ఇంకా ప్రధాన సమస్యగానే ఉంది. తెలంగాణాలో ఐటీ రంగం లక్షల కోట్లకు పెరుగుతున్నప్పటికీ, చాలామంది యువత చిన్న ప్రైవేట్ ఉద్యోగాలు, గిగ్ వర్క్, డెలివరీ, కాంట్రాక్ట్ పనులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వ రంగంలో కూడా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం పెరగడంతో తక్కువ జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, కార్మిక హక్కులు బలహీనపడటం వంటి సమస్యలు మరింత పెరుగుతున్నాయి.

### జీడీపీ పెరగడమే అభివృద్ధి కాదు..

పాలకులు చెబుతున్న అభివృద్ధి ఎక్కువగా కార్పొరేట్, మార్కెట్ కేంద్రితంగా మారిందనే విమర్శలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, గ్రామీణ తెలంగాణ మాత్రం అప్పులు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభంతోనే పోరాడుతోంది. జీడీపీ గణాంకాలు పెరగడం మాత్రమే అభివృద్ధి కాదు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. రైతుకు గౌరవప్రదమైన జీవితం, యువతకు స్థిరమైన ఉద్యోగాలు, అందరికీ విద్యా-వైద్య సదుపాయాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఒకవైపు సంపద కేంద్రీకృతమవుతుంటే, మరోవైపు గ్రామీణ పేదరికం పెరుగుతుంది. ఇది భవిష్యత్తులో సామాజిక అసంతృప్తికి దారితీయొచ్చు.

### స్వరాష్ట్ర ఉద్యమం సమసమాజం కోసం..

అందుకే ప్రభుత్వాలు నగర కేంద్రిత అభివృద్ధి నుంచి బయటకు రావాలి. గ్రామీణ పునర్నిర్మాణం, వ్యవసాయ రంగ బలోపేతం, ప్రభుత్వ రంగ ఉద్యోగాలు, చిన్న పరి శ్రమలు, ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల అభివృద్ధి ఇవే తెలంగాణ భవిష్యత్తుకు నిజమైన పునాదులు కావాలి. లేకపోతే రేపటి తెలంగాణ రెండు వేర్వేరు ప్రపంచాలుగా మారిపోతుంది. ఒకటి షైనింగ్ హైదరాబాద్, మరొకటి సఫరింగ్ తెలంగాణ.. తెలంగాణ ఉద్యమం చేసింది కేవలం ఒక నగరం కోసం కాదు.. ఒక సమాన సమాజం కోసం. హైదరాబాద్ వెలుగులు గ్రామీణ తెలంగాణ చీకట్లను కప్పిపుచ్చలేవు. గ్రామీణ తెలంగాణ బలపడినప్పుడే.. తెలంగాణ నిజమైన అభివృద్ధి సాధించినట్లు అవుతుంది.

# మహానాడు!

మహానాడు పేరిట తెలుగుదేశం పార్టీ వార్షిక సమావేశాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా 1875 చోట్ల హైబ్రిడ్ విధానంలో మే 27, 28 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహించారు. చట్ట సభల్లో పోటీ చేయడానికి మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని మహానాడు వేదికగా ప్రకటించడం ముదావహం. యువతకు పెద్ద పీట వేస్తామనడం మంచి విషయమే! ఆ పార్టీ వ్యవస్థాపకుడు తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి రామారావుకు భారత రత్న ప్రదానం చేయాలని మరోసారి తీర్మానించడం స్వాగతించదగినదే! ఆ మహనీయుని బహుదా ప్రస్తుతించిన మహానాడులో ఆయన ప్రవచించిన సిద్ధాంతాలు, విధానాలను గురించి విస్మరించడం విచారించ వలసిన విషయం. ఎన్ టి రామారావు పేరెత్తితేనే తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదం మన చెవుల్లో గింగురుమంటుంది. ఆనాడు తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ పాలకులకు తాకట్టు పెట్టిన దుష్ట కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎక్కుపెట్టిన శంఖారావమే కేవలం తొమ్మిది నెలల్లో అధికార పీఠానికి బాటలు వేసింది. రాష్ట్రాల హక్కుల కోసం పరితపించిన ఎన్ టి ఆర్ వివిధ ప్రతిపక్ష పార్టీలతో శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించారు. ఫెడరలిజం పరిరక్షణ ఆయన విధానంగా ఉండేది. కాగా అన్యాయంగా విభజించిన రాష్ట్రానికి మాటిచ్చిన ప్రత్యేక హోదాను, విభజన హామీలను తిరస్కరించిన బిజెపి తో జట్టు కట్టిన టిడిపి నేతలు ఆ వేదిక ద్వారా దాన్ని సమర్థించుకోవడం ఎన్ టి ఆర్ వారసత్వం ఎలా అవుతుంది? గవర్నర్ రాంలాల్ ద్వారా ఎన్ టి ఆర్ ను పదవీచ్యుతుడ్ని గావించిన కేంద్ర ప్రభుత్వ దాష్టీకాన్ని ఇప్పుడు మరింత దారుణంగా అమలు చేస్తున్న మోడీ-షా ద్వయాన్ని ఆకాశానికెత్తడం తారక రాముని ఆశయాలకు పూర్తి విరుద్ధం. ?మత సామరస్యాన్ని నిలబెట్టడానికి మైనారిటీలకు రక్షణ కల్పించడానికి ఎన్ టి ఆర్ కృషి చేశారు. దేశంలో మత సామరస్య పరిరక్షణకు ఆనాటి విధ్వంసకర రథయాత్రను వ్యతిరేకించారు. అలాంటి చరిత్ర గల టిడిపి ఈనాడు మత విద్వేషాన్ని రగుల్చుతున్న బిజెపి తో చెలిమి చేయడాన్ని ఎలా సమర్థించుకుంటారు? బిజెపి తెచ్చిన వినాశకర వక్ఫ్ బిల్లును పార్లమెంటులో టిడిపి బలపరచడం దారుణం. టిడిపి తీర్థం పుచ్చుకున్న ఉండి ఎం ఎల్ ఏ ఆకివీడు దళితవాడలో గొంతేనమ్మ గుడి కూల్చుతామని వీరంగం వేయడం, మరోవైపు కడపలో విద్వేష వివాదాల సృష్టి వంటివి కూటమిలో పరివార్ శక్తుల భాగస్వామ్యం ఉండడం వల్లనే పెచ్చరిల్లుతున్నాయి కదా! ఆరు నెలలు స్నేహం చేస్తే వారు వీరవుతారు అన్న మాదిరిగా సాక్షాత్తు చట్ట సభల్లో టిడిపి ముఖ్య నాయకులే మతం ప్రస్తావన చేసిన దుస్థితి గురించి మహానాడులో సమీక్షించారా? తెలుగు దేశం పార్టీ జెండా




రూపకల్పనలో నాగలి రైతులకు చక్రం కార్మికులకు ప్రతీకగా ఆనాడు పేర్కొన్నారు. కానీ ఈనాటి కూటమి పాలనలో రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కాదు సరికదా మద్దతు ధరనైనా కల్పిస్తున్నారా? ఎల్లవేళలా కార్పొరేట్ల భజన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనడమే తప్ప కార్మిక సంక్షేమం ఊసెత్తుతున్నారా ? పొరుగు రాష్ట్రం ప్రకటించిన తరువాతయినా ఈ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు గురించి కనీసంగా ఆలోచించదా? మరి ఆ పతాకానికి, అందులోని చిహ్నాలకీ విలువేమిటి అని నిజాయితీ గల టిడిపి కార్యకర్తలు ప్రశ్నిస్తే ఏలికలేం చెబుతారు? ?అయితే, బిజెపితో చెట్టపట్టాలు వేసుకుంటున్నప్పటికీ దేశమంతటా వారు తెచ్చి పెట్టిన వివాదాస్పద ఎస్ ఐ ఆర్ గురించి అప్రమత్తంగా వుండాలని టిడిపి అధినేత తమ కార్యకర్తలకు హెచ్చరించడం, ఆ ప్రమాదాన్ని గుర్తించడం బాగానే వుంది. అదే విధంగా వినాశకర కేంద్ర ప్రభుత్వ విధానాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎన్ టి ఆర్ జపం చేయడం మాత్రమే గాక అయన అనుసరించిన విధానాలను అమలు చేయడానికి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి టిడిపి కృషి చేయాలి. అదే ఎన్ టి ఆర్ కి నిజమైన నివాళి అవుతుంది.

## మయన్మార్ అధ్యక్షుడు భారత్ పర్యటన



బుద్ధగయ (బీహార్) : మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్ భారత్ పర్యటనలో భాగంగా శనివారం మొదటగా బీహార్‌లోని బోధ్‌గయాకు చేరుకున్నారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడించారు. మయన్మార్ అధ్యక్షుడిని బీహార్ విమానాశ్రయంలో ఆ రాష్ట్ర గవర్నర్, లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అత హస్నైన్ (రిటైర్డ్) ఆయనకు స్వాగతం పలికారు. ఇరు దేశాల మధ్య ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రజల మధ్య సంబంధాలను ఈ పర్యటన ద్వారా మరింత బలోపేతం చేయనుంది అని రణధీర్ జైశ్వాల్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, నేడు మయన్మార్ అధ్యక్షుడు బీహార్‌లోని గయా జిల్లాలో ఉన్న బౌద్ధుల పుణ్య క్షేత్రాల్లో ఒకటైన మహబోధి ఆలయాన్ని సందర్శించనున్నారు. ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు యూ మిన్ భారత్ పర్యటన మే 30 -- జూన్ 2 వరకు కొనసాగతుంది. యూమిన్ భారత్ పర్యటన ఇదే తొలిసారి. జూన్ 1వ తేదీన ఢిల్లీలో ప్రధాని మోడీతో ఈయన సమావేశం కానున్నారు. ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించుకోనున్నారు. జూన్ 2వ తేదీన దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు.ం

## సిబిఎస్ఇ రీ ఇవాల్యుయేషన్ పోర్టల్ పై సైబర్ దాడి




న్యూఢిల్లీ : సిబిఎస్ఇ రీ-ఇవాల్యుయేషన్ పోర్టల్ పై సైబర్ దాడి జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సుమారు 50మంది విద్యార్థులు అక్రమంగా లాగిన్ అయినట్లు వెల్లడించారు. ఈ పోర్టల్ పై అనధికారిక దాడులు జరిగాయని, చెల్లింపుల గేట్ వే హెచ్ డి ఎఫ్ సికి అనుసంధానించబడి ఉందని, సుమారు 50మంది విద్యార్థులు యాక్సిస్ అయ్యారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. హెచ్‌డిఎఫ్‌సి పేమెంట్ గేట్‌వే అనుసంధానంలో జరిగిన లోపాల ఆధారంగా ఈ దాడి జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీని ప్రభావంతో పోర్టల్‌లో ఫీజుల తీవ్రంగా ప్రభావితమయ్యాయని అన్నారు. సాధారణంగా ఉండాల్సిన రీ-ఇవాల్యుయేషన్ ఫీజులు ఒక్కసారిగా మారిపోయాయని, కొందరికి కేవలం ఒక రూపాయి ఫీజుగా చెల్లించాలని కనిపిస్తే, మరికొందరికి ఏకంగా 68,000 రూపాయలు చెల్లించాలని చూపినట్లు వెల్లడించారు. ఈ సమస్య కారణంగా 12వ తరగతి జవాబు పత్రాల ధృవీకరణ కోసం దరఖాస్తు చేసుకునే వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానం, రీ-ఇవాల్యుయేషన్ మౌలిక సదుపాయాలపై ఇప్పటికే దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. సమస్యను పరిష్కరించేందుకు ఐఐటీ మద్రాస్, ఐఐటీ కాన్పూర్ నిపుణుల సహాయాన్ని తీసుకున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్), నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా ప్రత్యామ్నాయ పేమెంట్ గేట్‌వేలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## బ్రెజిలియన్ గ్రూపులను ప్రపంచ ఉగ్రవాద గ్రూపులుగా ప్రకటించిన అమెరికా : ప్రశ్నించిన లూలా



బ్రెసిలియా : రెండు బ్రెజిలియన్ ముఠాలను అమెరికా ప్రపంచ ఉగ్రవాద గ్రూపులుగా గురువారం ప్రకటించింది. బ్రెజిల్‌కు చెందిన కమాండో వెర్మెల్హో (సివి), ప్రైమిరో కమాండో డా క్యాపిటల్ (పిసిసి) చర్యలు ప్రపంచ ఉగ్రవాద సంస్థల చర్యలను పోలి ఉన్నాయని.. అందుకే వీటిని ప్రపంచ ఉగ్రవాద (ఎస్‌డిజిటిలు) సంస్థలుగా పరిగణించడం జరుగుతుందని అమెరికా విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. అయితే అమెరికా తీసుకున్న ఈ నిర్ణయాన్ని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సల్వా తిరస్కరించారు. అసలెందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని అమెరికాను లూలా ప్రశ్నించారు. కమాండో డా క్యాపిటల్, కమాండో వెర్మోల్హో ఈ రెండు గ్రూపులు బ్రెజిల్‌లో అత్యంత హింసాత్మక నేర సంస్థలు. ఈ రెండు సంస్థల ప్రభావం కేవలం ఒక్క ప్రాంతానికే పరిమితమై లేదు.. దేశవ్యాప్తంగా విస్తరించింది అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అన్నారు. జూన్ 5 నుంచి ఈ రెండు గ్రూపులను విదేశీ ఉగ్రవాద సంస్థలు (ఎఫ్‌టిఓ)గా పరిగణించడం జరుగుతుందని మార్కో రూబియో తెలిపారు. కాగా, మార్కో రూబియో ప్రకటనపై లూలా డా సల్వా స్పందించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వాటి సంబంధిత నేరాలకు వ్యతిరేకంగా చేస్తోన్న పోరాటానికి అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం సమర్థవంతంగా దోహదపడదని లూలా ఎక్స్ పోస్టులో నొక్కి చెప్పారు. విదేశాంగ మంత్రి మార్కో రూబియో తీసుకున్న నిర్ణయాన్ని బట్టి చూస్తే.. బ్రెజిల్ భూభాగంలో అమెరికా చేపట్టబోయే చర్యలను సమర్థించుకునేందుకు తీసుకున్న వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ఎదుర్కోవాలనే నెపంతో బ్రెజిల్‌లో సైనిక జోక్యం చేసుకోవాలని వాషింగ్టన్‌ను బ్రెజిల్ మితవాద నాయకుడు బోల్సోనారో కోరుతున్నారు. ఆయన ఆ అవకాశాన్ని కూడా బహిరంగంగా ప్రచారం చేస్తున్నారని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా విమర్శించారు. కాగా, సివి, పిసిసి గ్రూపులను అమెరికా ప్రపంచ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించడంపై బ్రెజిల్ అధ్యక్షుడు ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రెజిల్ ఒక సార్వభౌమాధికార దేశం. లక్షలాది కుటుంబాలు నివశిస్తున్న ప్రాంతాల్లో నేరపూరిత సంస్థలైన పిసిసి, సివి గ్రూపులు చేస్తున్న ఉగ్రవాద కార్యకలాపాలకు వ్యతిరేకంగా బ్రెజిల్ నిరంతరం పోరాడుతుంది. ఈ సంస్థలు నేరాల ద్వారా, మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమణ రవాణా ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందడమే లక్ష్యంగా పెట్టుకుంటాయి. అలాంటి ఈ సంస్థల్ని అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో పోల్చకూడదు. ఎందుకంటే సైద్ధాంతిక, రాజకీయ, మతపరంగా అంతర్జాతీయ ఉగ్రవాదంతో ముడిపడి ఉండే ఆ సంస్థల చర్యలతో.. బ్రెజిల్ సివి, పిసిసి గ్రూపులను పొరపాటున కూడా చేర్చకూడదు లూలా తన ప్రకటనలో స్పష్టం చేశారు. అలాగే పన్నుల పెంపు విషయంలాగాగానే.. బ్రెజిల్లో అమెరికా జోక్యాన్ని పెంచడానికి ఆ విధమైన చర్యలుగా.. బొల్సొనారో కుటుంబం అమెరికాకు వెళ్లింది అని లూలా ప్రకటనలో ఆరోపించారు. బ్రెజిల్ వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా పోరాడుతోందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ లో లూలా అమెరికాలో పర్యటించారు. మే నెలలోనే అమెరికా నుంచి ఇలాంటి నిర్ణయం రావడం గమనార్హం.ం

## తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో స్పైస్ జెట్ - రూ. 124 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు

బిజినెస్ : ప్రముఖ బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్ జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. నెలల తరబడి జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైనందుకుగాను వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శాఖ ఆ సంస్థకు రూ. 124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేగాక పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. నిర్దేశిత గడువులోగా స్పైస్‌జెట్ రిటర్నులు దాఖలు చేయకపోవడంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్-62 కింద అధికారులు ప్రొవిజనల్ అసెస్‌మెంట్ నిర్వహించి ఈ పన్ను డిమాండ్‌ను ఖరారు చేశారు. నవంబర్ నెలకు రూ. 44.44 కోట్లు, డిసెంబర్‌కు రూ. 43.79 కోట్లు, జనవరికి రూ. 12.19 కోట్లు, ఫిబ్రవరికి రూ. 12.10 కోట్లు, మార్చి నెలకు రూ. 12.12 కోట్ల చొప్పున బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి ఈ నెల 25 న షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ, సంస్థ నుంచి ఇంకా పూర్తిస్థాయి స్పందన రాలేదని తెలుస్తోంది. "పెండింగ్‌లో ఉన్న రిటర్నులను స్పైస్‌జెట్ వెంటనే దాఖలు చేసి, చట్టపరమైన నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఓ అధికారి స్పష్టం చేశారు. కాగా, స్పైస్‌జెట్ ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది. 2025 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.621 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. నిన్నటి ట్రేడింగ్‌లో బిఎస్‌ఈలో స్పైస్‌జెట్ షేరు ధర 0.47 శాతం తగ్గి రూ.12.75 వద్ద ముగిసింది.

## ఎల్‌నినో ఎఫెక్ట్: ఈసారి ఆ "అద్భుతం" జరగకపోతే..?




రెండేళ్లపాటు సమృద్ధిగా కురిసిన వర్షాలకు ఈసారి బ్రేక్ పడే సూచనలు కనిపిస్తున్నాయి. దశాబ్దకాలం తరువాత రుతుపవనాలు బలహీనంగా మారే ప్రమాదం ఉందన్న భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరికలే ఇందుకు కారణం. గోరుచుట్టుపై రోకటిపోటు చందంగా ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే ప్రమాదమే కాకుండా.. ఆ లోటు తీవ్రంగా ఉండే అవకాశమూ ఉందని ఐఎండీ చెబుతోంది. ఈ నేపథ్యంలోనే 2015 నాటి అత్యల్ప వర్షపాత రికార్డులు బద్ధలవుతాయా?, ప్రజలు మరోసారి కరవు కోరల్లో చిక్కుకుంటారా? అన్న అందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. భారతదేశానికి జీవనాధారం లాంటి నైరుతి రుతుపవనాలు.. సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు దేశంలో దాదాపు 70 శాతం వర్షాన్ని అందిస్తాయి. 2024, 2025లో ఈ సీజన్‌లో వర్షాలు బాగా కురిశాయి. జలాశయాలు నిండిపోయాయి. వ్యవసాయం కూడా మెరుగైన ఫలితాలు ఇచ్చింది. కానీ 2026లో ఈ సానుకూల పరిస్థితి ప్రతికూలంగా మారిపోయే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం ఈసారి నైరుతి రుతుపవనాలు సాధారణ స్థాయికి కేవలం 90 శాతం మాత్రమే ఉండే అవకాశం ఉంది. ఈ అంచనా నిజమైతే 2015 తర్వాత దేశంలో నమోదయ్యే అత్యల్ప వర్షపాతం ఇదే అవుతుంది. ఆ ఏడాది భారత్ తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంది. ఆ సమయంలో పంటలు దెబ్బతినడం, నీటి వనరులు తగ్గిపోవడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి లోనవడం వంటి ప్రభావాలు కనిపించాయి. ఇక ఈసారి మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. సాధారణంగా ఇలాంటి బలహీన మాన్సూన్ వచ్చే అవకాశం కేవలం 16 శాతం మాత్రమే ఉండగా, తాజా అంచనాల్లో అది ఏకంగా 60 శాతానికి పెరిగింది. అంటే సాధారణ పరిస్థితులతో పోలిస్తే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని.. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశమే ఎక్కువగా ఉందని అర్థమన్నమాట. ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావాన్ని చూపిస్తున్నారు. ఎల్‌నినో అనేది.. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ మార్పు. సాధారణ పరిస్థితుల్లో పసిఫిక్ నుంచి వచ్చే గాలులు, సముద్ర ప్రవాహాలు భారతదేశ రుతుపవనాలను బలపరుస్తాయి. అయితే ఎల్‌నినో వల్ల ఈ గాలుల వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఫలితంగా భారతదేశానికి చేరే తేమ తగ్గి.. వర్షాలూ తగ్గిపోతాయి. అందుకే ఎల్‌నినో ప్రభావం వచ్చిన చాలా సంవత్సరాల్లో భారత్‌లో వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదం ఉందని అంచనాలు సూచిస్తున్నాయి. ఇక్కడ మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈసారి ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే సహజ వాతావరణ వ్యవస్థ అయిన భారత మహాసముద్ర డైపోల్ కూడా న్యూట్రల్‌గా ఉండే అవకాశం ఉంది. సాధారణంగా ఐవోడీ సానుకూలంగా ఉన్నప్పుడు భారతదేశానికి అదనంగా తేమను అందించి వర్షపాతం కొంతవరకు పెరగడానికి సహాయపడుతుంది. కానీ ఈసారి అది న్యూట్రల్‌గా ఉండే పరిస్థితి కనిపిస్తోంది. దీని అర్థం ఏమిటంటే.. ఎల్‌నినో వల్ల వర్షాలు తగ్గే ప్రభావాన్ని సమతుల్యం చేసే "సహజ రక్షణ వ్యవస్థ" పనిచేయదన్నమాట. ఫలితంగా వర్షపాతం తగ్గే ప్రమాదాన్ని తగ్గించే అదనపు బలం లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఎల్‌నినో ప్రభావం నేరుగా మాన్సూన్‌పై ఎక్కువగా పడే అవకాశం ఉండి.. వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశాన్ని పెంచుతోంది. ప్రాంతాల వారీగా చూస్తే మధ్య భారతం, దక్షిణ భారతం, వాయువ్య భారతంలో వర్షాలు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా గుజరాత్ నుంచి ఒడిశా వరకు విస్తరించిన మాన్సూన్ కోర్ జోన్‌లో వర్షాభావం ఎక్కువగా ఉండొచ్చని అంచనా. ఈ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతుండటంతో పంటలపై నేరుగా ప్రభావం పడే అవకాశం ఉంది. వర్షాలు తగ్గితే వరి, పప్పులు, నూనెగింజలు, చిరుధాన్యాల ఉత్పత్తి తగ్గి ఆహార ధరలు పెరిగే ప్రమాదం ఉంది. దీంతో ద్రవ్యోల్బణం పెరిగి సాధారణ ప్రజలపై భారం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే శాస్త్రవేత్తలు ఒక విషయం స్పష్టం చేస్తున్నారు. ఎల్‌నినో ఉన్నప్పటికీ ప్రతి సారి కరువు తప్పనిసరిగా వస్తుందనేది కాదు. గతంలో కూడా కొన్ని ఎల్‌నినో సంవత్సరాల్లో సాధారణ వర్షాలు నమోదైన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అయితే.. ఈ సీజన్ సూచనలు మాత్రం ఆందోళన కలిగించే స్థాయిలో ఉన్నాయని చెబుతున్నారు. 2015 కరువు రికార్డు మళ్లీ తిరగరాయబడుతుందా? లేదంటే ఏదైనా అద్భుతం జరిగి ఈసారి నైరుతి ఆశ్చర్యపరుస్తుందా? అని వాతావరణ శాస్త్రవేత్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## రాయలసీమ గడ్డ... రక్షణ రంగ ఉత్పత్తుల అడ్డా!




ఒకప్పుడు కరువు, వలసలు, నిరుద్యోగం అనే పదాలతో గుర్తింపు పొందిన రాయలసీమ ఇప్పుడు కొత్త చరిత్రకు సిద్ధమవుతోంది. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఆమ్కా) ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన జరగడం కేవలం ఒక పరిశ్రమ ప్రారంభం కాదు. ఇది రాయలసీమ భవిష్యత్తును మార్చే సాంకేతిక, పారిశ్రామిక విప్లవానికి నాంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ భారతదేశం స్వయంగా అభివృద్ధి చేస్తున్న తొలి ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ కార్యక్రమం కావడం విశేషం.

### పుట్టపర్తి ఎంపికలో వ్యూహాత్మక కారణాలు..

ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనా వంటి కొద్ది దేశాలకే పరిమితమైన ఈ అత్యాధునిక సాంకేతికత ఇప్పుడు భారతదేశంలో, అదీ రాయలసీమ నేలపై రూపుదిద్దుకోబోతోంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌ను కేవలం పరిశ్రమగా కాకుండా భారత రక్షణ రంగ చరిత్రలో ఒక కీలక మలుపుగా చూస్తున్నారు. ఇప్పటికే అక్కడ రన్‌వే అందుబాటులో ఉండటం, బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి సమీపంలో ఉండటం, ఎయిర్ ట్రాఫిక్ రద్దీ తక్కువగా ఉండటం వంటి అంశాలు దీనికి అనుకూలంగా మారాయి. ఫ్లైట్ టెస్టింగ్‌కు అవసరమైన ప్రశాంత వాతావరణం, విస్తారమైన భూములు కూడా పుట్టపర్తికి అనుకూల అంశం నిలిచాయి. దీంతో భవిష్యత్తులో ఇది దేశంలోనే అత్యంత కీలక ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా ఎదిగే అవకాశం కనిపిస్తోంది. ప్రపంచ స్థాయి రక్షణ పరిశోధన సదుపాయాలు రాయలసీమలో ఏర్పడటం ప్రాంత భవిష్యత్తును పూర్తిగా మార్చే పరిణామంగా భావిస్తున్నారు.

### స్థానిక యువతకు భారీగా ఉపాధి!

ఈ ప్రాజెక్ట్ వల్ల స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు వెళ్లాల్సి వచ్చిన యువతకు ఇప్పుడు తమ ప్రాంతంలోనే అవకాశాలు కనిపి స్తున్నాయి. ప్రత్యక్షంగా వేలాది ఉద్యోగాలతో పాటు పరోక్షంగా మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉంది. యుద్ధ విమానాల తయారీ అంటే కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదు. దాని చుట్టూ వందలాది అనుబంధ పరిశ్రమలు ఏర్పడతాయి. ఎలక్ట్రానిక్ భాగాల తయారీ యూనిట్లు, డ్రోన్ టెక్నాలజీ సంస్థలు, సాఫ్ట్‌వేర్ సపోర్ట్ కంపెనీలు, మెటల్ ఫ్యాబ్రికేషన్ పరిశ్రమలు ఒక్కొక్కటిగా వస్తాయి. దీంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా కొత్త అవకాశాలు ఏర్పడతాయి.

### రాయలసీమలో పారిశ్రామిక వాతావరణం..

రాయలసీమలో పారిశ్రామిక వాతావరణం పూర్తిగా మారే అవకాశం ఉంది. ప్రపంచ స్థాయి సాంకేతికతకు నిదర్శనం. ఈ పరిణామంలో మరో ముఖ్యమైన అంశం కర్నూలులో ఏర్పాటు కానున్న డ్రోన్ సిటీ. ఎనిమిది కంపెనీలు కలిసి ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నాయి. డ్రోన్ టెక్నాలజీ ఇక యుద్ధరంగానికే పరిమితం కాదు. వ్యవసాయం, వైద్య సేవలు, విపత్తు నిర్వహణ, సరుకు రవాణా వంటి అనేక రంగాల్లో దీని వినియోగం పెరుగుతోంది. భవిష్యత్తులో కర్నూలు దేశ డ్రోన్ హబ్‌గా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### దేశ రక్షణ రంగానికి వెన్నెముక..

భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్‌ఎఫ్‌సిఎల్, అగ్నియాస్త్ర వంటి సంస్థల పెట్టుబడులు కూడా ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ తయారీ రంగంలో కీలక రాష్ట్రంగా నిలబెట్టే సూచనలు ఇస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో నౌకాదళ వ్యవస్థల తయారీ కేంద్రం, టార్పెడో తయారీ సదుపాయాలు వంటి ప్రాజెక్టులు కూడా రాష్ట్రానికి కొత్త అవకాశాలు తీసుకురానున్నాయి. ఆమ్కా ప్రాజెక్ట్ విజయవంతమైతే రాయలసీమ రూపురేఖలు పూర్తిగా మారిపోవచ్చు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా భావించిన నేల... రేపు దేశ రక్షణ రంగానికి వెన్నెముకగా నిలిచే అవకాశం ఉంది. అది భారత ఆత్మవిశ్వాసానికి, స్వదేశీ సాంకేతికతకు, మారుతున్న రాయలసీమ భవిష్యత్తుకు ప్రతీక.

## ప్రైవేటు విద్యాసంస్థలు.. కార్పొరేట్ కలెక్షన్ సెంటర్లు..

ఏతల్లిదండ్రులైనా తమ పిల్లలకు ఉన్నత భవిష్యత్తు అందించేందుకు తపన పడుతుంటారు. ఎంత కష్టమైనా ఖర్చయినా నాణ్యమైన విద్యను అందించాలని కోరుకుంటారు.. కానీ వారి ఆరాటాన్ని సొమ్ము చేసుకుంటున్నాయి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు.

### అక్షరాలతో లక్షల వ్యాపారం..

రాష్ట్రంలో తల్లితండ్రులు తమ పిల్లలను చదివిపిద్దామని ప్రైవేట్ విద్యాసంస్థలకు పోతే అక్కడ చదువుకొనాలని ఉందని వారు వాపోతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అంటే కాన్వెంట్స్, కార్పొరేట్స్, కలెక్షన్ సెంటర్స్‌గా మారాయి. ప్రైవేట్ విద్యా సంస్థలు దోపిడీ కేంద్రాలుగా, విద్యతో వ్యాపారం, అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నాయి. విద్యార్థులు వారి తల్లిదండ్రుల వద్ద నుండి అయిదు వందల నుండి లక్షల రూపాయల దోచుకునే ముఠా సంస్థలుగా ప్రైవేట్ విద్యాసంస్థలు వేదిక అయ్యాయి. చదువు చారెడు బలుపలు దోచేడు అనే సామెత నేడు ప్రైవేట్ విద్యాసంస్థలను చూస్తే గుర్తుకు రావలసిందే.

### అడ్మిషన్లను అప్పుడే నింపేశారు..

వచ్చే విద్యా సంవత్సరంలో జూన్ 1నుండి జూనియర్ కళాశాలలు ప్రారంభం, జూన్ 12నుండి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే అన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు అడ్మిషన్లు నింపుకొని ఉన్నాయి. కేజీ నుండి బీటెక్ వరకు ఉన్న ఫీజులు చూస్తే భయపడాల్సిందే కానీ ఈ ఫీజుల గురించి మాత్రం అధికారులకు చెప్పినా వారికి విన పడవు. చూపిస్తే చర్యలు ఉండవు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులు, వారి తల్లితండ్రుల నుండి ఫీజుల దోపిడీకి సిద్ధం అయ్యాయి. ఇప్పటికే అనేక కార్పొరేట్ విద్యాసంస్థలు నో అడ్మిషన్ అంటూ విద్యా వ్యాపారం సగం పూర్తి చేశాయి.

### ఫీజులు చూస్తే వణకాల్సిందే!

పాఠశాలలల్లో అడ్మిషన్ పొందాలంటే అడ్మిషన్ ఫీజును చూసే భయపడాల్సిందే. మొదట రిజిస్ట్రేషన్ ఫీజు కట్టి ప్రవేశ పరీక్ష రాసి అందులో పాస్ అయితేనే పాఠశాలలో అడ్మిషన్ ఆ తర్వాత అడ్మిషన్ ఫీజు. రాష్ట్రంలో చిన్న పాఠశాలలో అయిదు వందల నుండి




మొదలుకొని కార్పొరేట్లలో ఇరవై వేల వరకు వసూళ్లు, ట్యూషన్ ఫీజు వేరు, హాస్టల్ ఫీజు వేరు ఈ ఫీజులు ప్రతి సంవత్సరం 20 నుండి 30% పెంచుతున్నారు. చిన్న చిన్న జిల్లా కేంద్రాల్లో నర్సరీకి 30వేలు ఉంటే హైదరాబాద్ మహా పట్టణంలో 1లక్షా 50 వేల ఫీజు తీసుకుంటున్నారు. జిల్లాల్లో కొన్ని పాఠశాలల్లో 9, 10వ తరగతులకు 80వేల నుండి 2లక్షల వరకు ఫీజులు ఉంటే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, కరీంనగర్, హన్మకొండ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ఉన్న కార్పొరేట్ పాఠశాలల్లో 3లక్షల నుండి 6 లక్షల వరకు ఫీజులు ఉన్నా సౌకర్యాల్లో మాత్రం సున్నానే.

### యూనిఫాం పేరిట దోపిడీ..

ముఖ్యంగా ప్రైమరీ పాఠశాల విద్యార్థుల పుస్తకాలు ఒకటి నుండి అయిదవ తరగతి వరకు ప్రభుత్వ పుస్తకాలు కాకపోవడంతో యాజమాన్యాలు ఈ ప్రైమరీ పుస్తకాల పేరుతోనే ఎక్కువగా దోచుకుంటూ సిరీస్‌ల పేరుతో ఆ కంపెనీలతో కుమ్మక్కై ఈ పాఠశాలలో అమ్మే సీరిస్ బుక్‌లను పక్క పాఠశాలల్లో అమ్మకుండా యాజమాన్యాలు సిండికేట్ అవుతున్నారు. ప్రతి పుస్తకంపై పాఠశాల పేర్లు ఉండి, పాఠశాల ఆవరణలోనే అమ్ముతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు.. కొనే పుస్తకాలు, యూనిఫామ్స్, స్టేషనరీ వస్తువులపై బిల్లులు కూడా ఇవ్వరు. కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో స్టడీ మెటీరియల్, యూనిఫార్మ్ పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. కళాశాల వారు యూనిఫామ్స్ పేరుతో పది నుంచి పదిహేను వేల వరకు వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు అరికట్టి ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిబంధ నలు పాటించేలా రాష్ట్రంలో విద్య అందరికీ అందుబాటులో ఉండేలా కామన్ విద్య విధానాన్ని తీసుకువచ్చి, ఫీజుల నియంత్రణ చట్టం, విద్యాహక్కు చట్టం కఠినంగా అమలు అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

